

నగరంలో డ్రగ్స్ కలకలం

- 25 గ్రాముల కొకైన్ స్వాధీనం
- ఢిల్లీ నుంచి దిగుమతి
- దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తితోపాటు నగరానికి చెందిన యువకుడి అరెస్టు
- తదుపరి దర్యాప్తు కోసం ఢిల్లీకి ప్రత్యేక బృందం

... మెయిన్ 3లో



పర్యాటకం, ఐటీ, విద్యా రంగాలు..

ఈ మూడింటిపై రానున్న ఏడాది కాలంలో ప్రధాన దృష్టి

- మూడేళ్లలో పది పెద్ద హోటళ్ల నిర్మాణం
- ఐటీ సంస్థలకు భూమి సిద్ధం
- ఈ ఏడాదిలోనే టీసీఎస్ కార్యకలాపాలు
- తొలిదశలో 2,000 మంది ఉద్యోగులు
- రెండు, మూడేళ్లలో 10,000 మంది...
- భోగాపురం సమీపాన సివిల్ ఏవియేషన్ వర్సిటీ



- 2026 జూన్‌కల్లా మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం పూర్తి
- నగరంలో కాలుష్యం తగ్గింపుపై దృష్టి
- ఏడాదికి పది లక్షల మొక్కలు నాటతాం
- 'యోగా' కార్యక్రమానికి గిన్నిస్ రికార్డు మరిచిపోలేని అనుభూతి
- ఏడాదికాలం సంతృప్తికరంగా సాగింది
- కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా ఏడాది పూర్తిచేసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఏడాదికాలం సంతృప్తి కరంగా సాగిందన్నారు. ఆయన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుని జూలై మూడో తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడారు.

అనుకున్న పనులు ఒకటి, రెండు చేయలేకపోయినా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ప్రారంభం అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రైల్వే జోన్ పనులు ప్రారంభం కావడం మంచి విషయమన్నారు. అలాగే మెట్రో రైలు ప్రాజెక్టు కోసం డీపీఆర్ రూపొందించి ప్రభుత్వానికి పంపామన్నారు. భూసేకరణ చురుగ్గా సాగుతుందన్నారు. ఏడాదిలో రెండుసార్లు నగరంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన పర్యటనలు విజయవంతమయ్యాయన్నారు. ప్రధాని పాల్గొన్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. లక్షల మంది పాల్గొనే కార్యక్రమం విజయవంతం అయ్యేంత వరకూ కొంత టెన్షన్, భయం ... మిగతా 6వ పేజీలో

గిరి ప్రదక్షిణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

- కొబ్బరికాయలు కొట్టేందుకు 60 పాయింట్లు
- అప్పుఘర్ వద్ద మాత్రమే సముద్ర స్నానాలకు అనుమతి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన జరిగే సింహగిరి ప్రదక్షిణకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ప్రదక్షిణకు ఐదు లక్షల నుంచి ఆరు లక్షల మంది వస్తారని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రదక్షిణ జరిగే ప్రాంతాల్లో వీధి దీపాలు, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 35 వైద్య శిబిరాలు, పది అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులు అప్పుఘర్ వద్ద మాత్రమే స్నానాలు చేయాలని, అక్కడే ఏర్పాట్లు చేశామన్నారు. రెండు షిఫ్ట్‌లలో 25 మంది చొప్పున గజ ఈతగాళ్లను పెడుతున్నామని, సముద్రంలో బోట్లు కూడా ఉంటాయన్నారు. అడవివరంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టడానికి 60 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. కొండపైకి వెళ్లడానికి 50 బస్సులు ఉంటాయన్నారు. తొలి పావంచా వద్ద శనివారం సాయంత్రం షెడ్లు కూలిపోయిన అంశంపై మాట్లాడుతూ, క్రేన్ తగలడం వల్ల ఆ ప్రమాదం జరిగిందన్నారు.

బటర్‌ఫ్లై పార్కు స్థలం బదలాయింపుపై ఆరా

- అందుకు సంబంధించిన ఫైల్ పంపాల్సిందిగా జీవీఎంసీ అధికారులకు పురపాలక శాఖ కమిషనర్ ఆదేశం

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 పరిధి ఆరో వార్డులో బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల స్థలాన్ని, వెనుక ఉన్న ప్రైవేటు భూమి యజమానులకు బదలాయించిన అంశంపై రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆరా తీసినట్టు తెలిసింది. మధురవాడలో 1.02



పార్కు స్థలం పాయె

జూలై 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనం

ఎకరాల్లో ఉన్న ఓపెన్‌స్పేస్‌ను జీవీఎంసీ రూ.1.92 కోట్లు వెచ్చించి బటర్‌ఫ్లై పార్కుగా అభివృద్ధి చేసింది. సీతాకోకచిలుక ఆకారంలో పార్కు స్థలం ఉండడంతో దానికి అదే పేరు (బటర్ ఫ్లై) ఖరారుచేసింది. పార్కు వెనుక రెండు ఎకరాలకు పైగా భూమి ప్రైవేటు వ్యక్తులకు ఉంది. ఆ భూమికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో పార్కు స్థలంలో 489 గజాల స్థలాన్ని తమకు ఇస్తే, అందుకు ప్రతిగా పార్కు వెనుక ఉన్న తమ భూమిలో అంతే స్థలాన్ని బదలాయిస్తామని కోరుతూ జీవీఎంసీకి వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదన పంపారు. దీనికి అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని పెద్దల ద్వారా పావులు కదపడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. తర్వాత ఎన్నికలు రావడంతో

... మిగతా 6వ పేజీలో

విద్యార్థుల జీవితాలతో ఆటలు

ప్రైవేటు స్కూళ్ల అరాచకం

యూడైస్ వివరాలు వెల్లడిలో జాప్యం

- జిల్లాలో 14,000 మందికి ఇప్పటికీ హాజరు వేయలేని పరిస్థితి
- తల్లికి వందనం పథకం వర్తింపునకు గండం
- తల్లిదండ్రుల ఆందోళన
- ఎంఈవోల ఆదేశాలు పట్టించుకోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు



విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

తమ వద్ద నుంచి బయటకు వెళ్లే విద్యార్థుల వివరాలను వెల్లడించే విషయంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తున్నాయి. మండల విద్యాశాఖాధికారుల ఆదేశాలను కూడా లెక్కచేయడం లేదు. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచడంతో వారంతా తల్లికి వందనం పథకానికి అర్హత కోల్పోయే ఉన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభంలో యూడైస్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి వివరాలను నమోదుచేస్తారు. ఒకవేళ పాఠశాల మారినట్టయితే సదరు విద్యా సంస్థకు చెందిన యూడైస్ ఖాతా నుంచి సదరు విద్యార్థి పేరు తొలగించాలి. అలా తొలగించిన విద్యార్థి వివరాలను 'డ్రాప్ బాక్స్'లో వేయాలి. విద్యార్థి ప్రవేశం పొందిన పాఠశాల యాజమాన్యం ఆ డ్రాప్ బాక్స్ నుంచి వివరాలు తీసుకుని తమ యూడైస్ ఖాతాలో నమోదు చేయాలి. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లే విద్యార్థి వివరాలు డ్రాప్ బాక్సు నుంచి తీసుకుని యూడైస్ ఖాతాలో నమోదుచేసిన తరువాతే సదరు పాఠశాలలో హాజరువేస్తారు. అంత వరకూ విద్యార్థి హాజరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేరు. అయితే, దీనిని చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయి. తాజా సమాచారం మేరకు సుమారు 14 వేల మంది విద్యార్థుల వివరాలు యూడైస్ ఖాతా నుంచి డ్రాప్ బాక్సుకు చేరలేదు. దీంతో వారంతా హాజరు కోల్పోతున్నారు. అత్యధికంగా గాజువాక మండలంలో 2,500 మంది, సీతమ్మధారలో 2,050 మంది, చినగదిలిలో 1,980, గోపాలపట్నంలో 1,850, మిగిలిన మండలాల్లో 1,000 మందికి అటుఇటుగా విద్యార్థుల హాజరు నమోదు కావడం లేదు. మొత్తం 14 వేలలో 12 వేల వివరాలు ప్రైవేటు పాఠశాలల యూడైస్ ఖాతాలో ఉన్నాయి. ప్రస్తుతం దీనిపై విద్యాశాఖలో తీవ్ర చర్చ నడుస్తోంది.

ప్రైవేటు పాఠశాలలు ఫీజులు చెల్లింపు కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకువస్తుంటాయి. దీంతో అప్పటివరకు చదివిన పాఠశాల నుంచి సమీపంలో మరో ప్రైవేటు లేదా ప్రభుత్వ పాఠశాలలో చేరతారు. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో చేరాలంటే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ఉండాలి. అయితే విద్యాహక్కు చట్టం వరకు 14 ఏళ్ల వరకు ఒక విద్యార్థి పాఠశాలలో చేరడానికి టీసీ అవసరం లేదు. టీసీ కోసం యాజమాన్యాలు ఒత్తిడి చేయకూడదు. ఈ నేపథ్యంలో జిల్లాలో అనేకమంది ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో మారుతున్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు యాజమాన్యాలు టీసీలు ఇవ్వడం లేదు సరికదా యూడైస్ ఖాతా నుంచి వారి పేరు తొలగించి డ్రాప్ బాక్స్‌లో వేయడం లేదు. దీంతో జిల్లాలో 14 వేల మంది విద్యార్థుల ... మిగతా 6వ పేజీలో

గంటల వ్యవధిలో జనన, మరణ ధ్రువపత్రాలు

- కేజీహెచ్ అధికారుల నిర్ణయం
- అందుకు తగిన పత్రాలు అందించిన రోజునే జారీ చేయాలని సిబ్బందికి ఆదేశాలు
- జాప్యం చేస్తే చర్యలు


విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో జనన, మరణ ధ్రువీ కరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నియంత్రించడంపై అధికారులు దృష్టిసారించారు. ఆస్పత్రిలో పుట్టే చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్లను, మృతిచెందిన వారికి డెత్ సర్టిఫికెట్లను ఎంఆర్‌వో సెక్షన్ ఆధ్వర్యంలో అందిస్తుంటారు. అయితే, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. సర్టిఫికెట్ల కోసం కొంతమంది సిబ్బంది డబ్బులు కూడా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల జారీలో వేగాన్ని పెంచాలని సిబ్బందికి ఆస్పత్రి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

కుటుంబ సభ్యుల నుంచి అవసరమైన పత్రాలను తీసుకున్న వెంటనే (అదేరోజు) సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగే పరిస్థితి ఉంటే అందుకు గల కారణాన్ని దరఖాస్తుదారులకు తెలియజేసి, మరుసటి రోజు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆ సెక్షన్‌కు అవసరమైన సిబ్బందిని కూడా కేటాయించారు. కేజీహెచ్‌లో ప్రతిరోజూ బర్త్ సర్టిఫికెట్ల కోసం 30 నుంచి 40, అలాగే, డెత్ సర్టిఫికెట్ల కోసం 15 నుంచి 20 దరఖాస్తులు వస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి తెలిపారు. ఇందుకోసం అవసరమైతే రెండు గంటలు అధిక సమయాన్ని వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ధ్రువపత్రాలు కీలకం..

బర్త్ సర్టిఫికెట్‌ను చిన్నారికి పేరు పెట్టిన తరువాత తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం తల్లిదండ్రులు ఆధార్‌లు, ఆస్పత్రిలో ప్రసవించినట్టు ఇచ్చే పత్రం తీసుకుని ఎంఆర్‌వో సెక్షన్‌ను సంప్రతించాల్సి ఉంటుంది. ఈ పత్రాలతోపాటు దరఖాస్తు పత్రాన్ని నింపి కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. ఈ పత్రాలు ఇచ్చిన కొన్ని గంటల్లోనే బర్త్ సర్టిఫికెట్ జారీచేస్తారు. అలాగే, కేజీహెచ్‌లో మృతిచెందిన వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు కూడా ఇదే తరహాలో కొన్ని పత్రాలు తీసుకురావాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులకు మాత్రమే ఈ సర్టిఫికెట్‌ను అందిస్తారు. ప్రస్తుతం ఈ సర్టిఫికెట్లు తీసుకునేందుకు రెండు, మూడుసార్లు ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దానివల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులకు తాజా నిర్ణయంతో చెక్ పడనుంది.

మాధవ్‌కు సన్మానం



అక్కయ్యపాలెం పోర్టు కళావాణి కల్యాణ మండపంలో శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను సన్మానిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి

- వార్త 6లో...

కేజీహెచ్‌కు అవినీతి జబ్బు

- రెండేళ్ల కిందట తొలగించిన రోగి మిత్రలకు మళ్లీ ఉద్యోగం ఇస్తామంటూ డబ్బుల వసూలు
- ఆస్పత్రికి చెందిన కీలక అధికారి సూచన మేరకు ఉపాధి కల్పన కార్యాలయం అధికారికి చెల్లింపు
- ఆప్కో్స్‌లో చేర్పిస్తామంటూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వద్ద మరో అధికారి కలెక్షన్
- కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులు
- విచారణ జరిపించాలని సూపరింటెండెంట్‌కు ఆదేశం

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):



కింగ్ జార్జ్ ఆస్పత్రిలో పనిచేసిన, పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి కొందరు భారీఎత్తున డబ్బుల వసూళ్లకు పాల్పడిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు కేటగిరీలకు చెందిన ఉద్యోగుల నుంచి ఆస్పత్రికి చెందిన అధికారితోపాటు మరో శాఖకు చెందిన అధికారి భారీమొత్తంలో వసూలు చేసినట్టు చెబుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కేజీహెచ్‌లో 12 ఏళ్లుగా రోగి మిత్రలుగా పని చేస్తున్న కొందరిని రెండేళ్ల కిందట అధికారులు తొలగించారు. అలా తొలగింపునకు గురైన 20 మందిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని ఆస్పత్రికి చెందిన ఒక అధికారి హామీ ఇచ్చారు. అయితే, అందుకు ఒక అధికారిని కలవాలని సూచించారు. సదరు ఆస్పత్రి అధికారి సూచన మేరకు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. అయితే, ఉద్యోగాలు ఇస్తామని, అందుకు కొంత మొత్తం ఖర్చవుతుందని ... మిగతా 6వ పేజీలో

పేదరికాన్ని రూపుమాపేందుకు పీ-4

జిల్లాలో 73 వేల కుటుంబాలు గుర్తింపు

- వారిని మార్గదర్శకులకు అనుసంధానం చేస్తాం
- స్వర్ణాంధ్ర సాధనకు సంకల్పంతో ముందుకు నడుద్దాం
- జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీలు
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్




పీ-4పై సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 విధానం అమలు కోసం అందరం కలిసి ముందుకునడుద్దామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ కోరారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ సమాజంలో దిగువస్థాయిలో ఉన్న 20 శాతం ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసి, పేదరికం లేని వ్యవస్థను స్థాపిద్దామని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పీ-4 విధానం అమలు చేస్తున్నారన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలను ఆర్థికంగా పైకి తీసుకురావడానికి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమం పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఏర్పాటుకానున్న కమిటీకి చైర్మన్‌గా పార్లమెంటు సభ్యుడు, సభ్య కార్యదర్శిగా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గ కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా, స్పెషల్ ఆఫీసర్ సభ్య కార్యదర్శిగా, వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. పీ-4 విధానం అమలు కోసం జిల్లాలో 73 వేల కుటుంబాలను ... మిగతా 6వ పేజీలో

పలు ప్రత్యేక రైళ్ల రద్దు

- రెగ్యులర్ రైళ్ల గమ్యాల కుదింపు



విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రేక్‌ల కొరత వల్ల పలు ప్రత్యేక రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశామని, శాశ్వత ప్రాతిపదికన రాకపోకలు సాగిస్తున్న కొన్ని రైళ్ల గమ్యాలు కుదించామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు.

రద్దయిన రైళ్లు: ఈ నెల 6న విశాఖ-పూరి రథయాత్ర ప్రత్యేక రైలు (08313), జగదల్‌పూర్-రూర్కెలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18108), జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18448)ను రద్దు చేశారు. 7న పూరి-జగదల్‌పూర్ రథయాత్ర ప్రత్యేక రైలు (08446), పూరి-విశాఖ రథయాత్ర ప్రత్యేక రైలు (08314), రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18107)ను రద్దు చేశారు.

కిరండూల్ రైళ్లు కోరాపుట్ వరకే

విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) 6, 7 ... మిగతా 6వ పేజీలో

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ ధర్నా

తగరపువలస,జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఏరియా కార్యదర్శి కె. రాంబాబు మాట్లాడుతూ స్మార్టు విద్యుత్ మీటర్లు వేయాలన్న ఆలోచన ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి ఎం. అప్పలరాజు, నాయకులు మావూరి వీర్రాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, గోవిందరావు, ముత్యాలరావు, అప్పారావు, తోటయ్య, రాము పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

సాగర్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డు నుంచి సాగర్‌నగర్ కాలనీకి వెళ్లే రహదారి పక్కనున్న పాన్ షాప్, టిఫిన్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. యజమానులు జనార్దన్, మూర్తి ఎప్పటిలాగే షాపులకు తాళాలు వేసి రాత్రి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి దొంగలు దుకాణాలకు ఉన్న తాళాలు పగలుగొట్టి రెండు గ్యాస్ సిలిండర్లు, కొంత నగదు, సుమారు రూ. 50 వేల విలువ చేసే సామగ్రి అపహరించారు. గతంలోనూ ఈ దుకాణాల్లో చోరీలు జరిగాయి. ఆరిలోవ క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేత

తగరపువలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ సంక్షేమ భవన్‌లో కార్మికుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆదివారం సెలవు ప్రకటించారు. మిల్లు యాజమాన్యం నుంచి పరిహారాల కోసం గత నాలుగు రోజుల్లో కార్మికులు 289 దరఖాస్తులు అందించారు. వీటిలో పీఎఫ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు.

తుది విడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం, జూలై 5(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 10వ తేదీన సమర్పించనున్న తుది విడత చందనం అరగదీత శనివారం ప్రారంభమైంది. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు పూర్తిచేసి ముందుగా సిద్ధం చేసిన గంధపు చెక్కలను అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక శిలలపై 20 మంది సిబ్బంది, భక్తులు సంప్ర దాయబద్ధంగా చందనాన్ని అరగదీశారు. తొలిరోజు 36 కిలోల చందనం అరగతీయగా ఆలయ స్థానాచార్యులు తూనిక వేసి, పద్మనిధిలో భద్రపరిచారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

» దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్
» గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు గురించి కమిషనర్‌కు వివరిస్తున్న దేవస్థానం ఈఓ త్రినాథరావు

సింహాచలం. జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9, 10వ తేదీల్లో జరగనున్న సింహగిరి ప్రదక్షిణ ఉత్సవ ఏర్పాట్లను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కొడూరి రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. తొలుత ఆయన తొలిపావంచా వద్ద ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, గడ్డర్లు పనులను పరిశీలించారు. అక్కడ నుంచి సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్లలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేయనున్న స్టాల్స్, అప్పూఘర్, ఆర్కె బీచ్ వద్ద సముద్ర స్నానాల వద్ద చేపడుతున్న పనులు, మాధవధార వద్ద భక్తుల స్నానాలు, దుస్తుల మార్చుకునేందుకు చేపడుతున్న పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ వేంద్ర త్రినాథరావు, ఈఈలు రాంబాబు, వెంకటరమణ, రామకృష్ణ, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం

వరాహలక్ష్మీనృసింహుని సన్నిధిలో స్వామివారి ఆవిర్భావ నక్షత్రం స్వాతి పురస్కరించుకుని శనివారం స్వాతి నక్షత్ర హవనం నిర్వహించారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను, ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారధ్యంలో హవనాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. మహా పూర్ణాహుతి చేసి ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ అంతరాలయంలోకి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ కొడూరి రామచంద్రమోహన్, ఏఈఓ ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి

అప్పన్న స్వామిని ఐఏఎస్ అధికారి కె. నీలకంఠారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు.

శస్త్ర చికిత్సలో మత్తు వైద్యుల పాత్ర కీలకం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి


సదస్సును ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

కొమ్మాది, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : శస్త్ర చికిత్సలో మత్తు వైద్యుల పాత్ర కీలకమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా 34వ సౌత్ జోన్ వార్షిక సదస్సును శనివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో ఎనస్తీషియా ఎంతో కీలక విభాగం అన్నారు. ప్రస్తుతం వైద్య విధానంలో అనేక మార్పులు జరుగుతున్నాయని, వాటిపై వైద్యులతో పాటు వైద్యవిద్యార్థులు కూడా దృష్టిపెట్టాలని సూచించారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బాల వెంకట్, బాజువా మాట్లాడుతూ రోగి ఆరోగ్యం, నిర్వహించే శస్త్ర చికిత్సపై పూర్తి అవగాహన కలిగి ఉండడం మత్తు వైద్యుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సు ప్రాధాన్యత, వైద్య వృత్తి, మత్తు రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. అనంతరం ఐఎస్ఏ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు సిపిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి నుంచి సుమారు 1300 మంది మత్తు వైద్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎండాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెంది నట్లు పీఎంపాలెం స్టేషన్ సీఐ జి. బాలకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలం ఉప్పలవలస గ్రామానికి చెందిన నంబాల వెంకటరమణ మూర్తి (45) భార్య, ముగ్గురు పిల్లలతో ఎన్ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెంలోని తారకరామాఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నారు. ఎలక్ట్రికల్ ఉద్యోగిగా విధులు నిర్వహించిన ఆయన కొన్నేళ్లుగా ఉద్యోగానికి దూరంగా ఉంటున్నారు. ఆయన భార్య సుధారాణి ఇండియన్ రైల్వేలో గుమస్తాగా పని చేస్తున్నారు. శ్రీకాకుళం ఆర్డీవో కార్యాలయంలో వ్యక్తిగత పనుల నిమిత్తం మద్రిపాలెం ప్రాంత నివాసి, విశ్రాంత ఆడిటర్ కె.వెంకట్రావు (76) తో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వెళ్లారు.తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ సమీపంలో శ్రీకాకుళం నుంచి నగరానికి వస్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో బస్సు ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వెంకటరమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం వెనుక భాగంలో కూర్చున్న వెంకట్రావు గాయపడ్డారు. పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సమ్మెను విజయవంతం చేయండి'

మధురవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు కోరారు. మధురవాడలోని ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద శనివారం ఆయన పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో 843 కేసులు పరిష్కారం

భీమునిపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 843 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్ సౌజన్య, ఒకటో అదనపు జూనియరు సివిల్ జడ్జి కోర్టులో మెజిస్ట్రేట్ స్వామి భవాని ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లు జరిగాయి.



కృష్ణావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు శనివారం దర్శనం ఇచ్చారు.తెల్లవారుజామున ఆలయ అర్చకుడు రొంపిచెర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.భీమిలి, పద్మనాభం, ఆనందపురం, తగరపువలస, మధురవాడ, బీచ్ రోడ్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శివ, కేశవ ఆలయ సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ రొంపిచెర్ల సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ, కృష్ణావతార విశిష్టతను భక్తులకు వివరించారు.

పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణ

భీమునిపట్నం (రూరల్), జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మాదిరి అన్ని పంచాయతీల్లోనూ తడి పొడి చెత్త సేకరించనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన రేఖవానిపాలెం, మూలకుద్దు గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లోనూ ఏ రోజు కారోజు చెత్త సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి. రామారావు, బి, గాయత్రి, ఆయా గ్రామాల సర్పంచులు , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

... 5వ పేజీ తరువాయి

వివరాలపై గందరగోళం నెలకొంది. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నా హాజరు వేయడం లేదు. దీనిపై మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలో ప్రైవేటు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినా ఎక్కువమంది పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు హాజరు వేయకపోవడంతో తల్లికి వందనం పథకం వర్తించదని ఉపాధ్యాయులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వ్యాధుల పట్ల అప్రమత్తం : ఎంపీపీ

పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాంబాబు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.దోమల వ్యాప్తి లేకుండా చేయాలన్నారు. అలాగే ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం తాగునీటి సమస్యపై పలువురు సభ్యులు ప్రస్తావించగా గ్రామీణ నీటి సరఫరా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. ప్రధాన రోడ్లలో పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా ఆర్అండ్‌బీ శాఖ అధికారులను దీనిపై లేఖ రాయాలని ఎంపీపీ ఆదేశించారు. కాగా మండలానికి కొత్తగా వచ్చిన అధికారుల పరిచయంతో పాటు, బదిలీపై వెళ్లిన వారిని సత్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఈర్లె రాజేశ్వరి, ఎంపీడీఓ విజయకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు అవినీతి జబ్బు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులకు సదరు అధికారి స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక్కొక్కరూ రూ.20 వేలు చొప్పున రెండు విడతల్లో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారికి సమర్పించారు. రోజులు గడుస్తున్నా డబ్బులు తీసుకున్న అధికారి ఉద్యోగాన్ని కల్పించకపోవడంతో వారంతా కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. డబ్బులు తీసుకున్నారని, ఉద్యోగం కూడా ఇవ్వలేదని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే, ఎన్‌టీఆర్ వైద్యసేవలో పనిచేసే సుమారు 50 మంది ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కోస్)లోకి మార్పిస్తామంటూ ఆస్పత్రి అధికారి ఒకరు డబ్బులు తీసుకున్నారంటూవసూలు చేశారంటూ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. రెండు వేర్వేరు వ్యవహారాల్లో ఆస్పత్రికి చెందిన ఉద్యోగులపై ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని వివరణ కోరగా..తన దృష్టికి సమస్య రాలేదన్నారు. ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడిన వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోపణలపై దృష్టిసారించరా..?

కేజీహెచ్‌లో పనిచేసే ఉద్యోగుల నుంచి అధికారులు డబ్బులు తీసుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణ చేయాల్సిన అవసరం ఉంది. వెంటనే విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కొద్దిరోజుల కిందట ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు దీనిపై దృష్టిసారించకపోవడం గమనార్హం.

పర్యాటకం, ఐటీ, విద్యా రంగం...

... 5వ పేజీ తరువాయి

కలిగాయని, అయితే నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సహకారంతో సజావుగా సాగి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. నగరానికి కొత్తగా వచ్చిన డబుల్ డెక్కర్ బస్సులు వారం, పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలో ప్రధానంగా మూడు రంగాలపై దృష్టిసారించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఉపాధి అవకాశాలు విస్తృతం చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలంటే పర్యాటకం, ఐటీ, విద్యా రంగాల్లో కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పర్యాటకానికి సంబంధించి అతిథ్య రంగం విస్తరణకు రానున్న రెండు, మూడేళ్లలో నగరంలో పేరున్న పది హోటళ్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే వరుణ్‌బీచ్, అన్నవరంలో ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా మే ఫ్రంట్ హోటల్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు.దీనివల్ల యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు నగరానికి రావడంతో వ్యాపారాలు పెరుగుతాయని తద్వారా ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. విశాఖను ఐటీ నగరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కొత్త సంస్థలను ఆహ్వానించి భూములు కేటాయిస్తామన్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణ చేపట్టామన్నారు. టీసీఎస్ ఈ ఏడాదిలోనే విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నదని, తొలిదశలో రెండు వేల మందిని నియమించుకుంటుందన్నారు.రానున్న రెండు, మూడేళ్లలో పది వేల మందితో కార్యకలాపాలు విస్తరించనున్నదని తెలిపారు. మరికొన్ని ఐటీ సంస్థలు విశాఖ కేంద్రంగా సేవలు అందించడానికి ముందుకువస్తున్నాయన్నారు. పర్యాటకం, ఐటీ రంగాలు, ఇతర రంగాలు ఏర్పాటుకావాలంటే అక్కడ పనిచేయడానికి అవసరమైన నిపుణులు అవసరమని పేర్కొన్నారు. దీనికోసం విద్యా రంగంపై ఫోకస్ పెట్టామన్నారు. భోగాపురం సమీపాన సివిల్ ఏవియేషన్ వర్సిటీ రానున్నదని సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. టెక్నాలజీ రంగంలో పేరున్న విద్యా సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని, వీరి కోసం భూమి సిద్ధం చేశామన్నారు. విశాఖ అభివృద్ధి కోసం ఎంతో కీలకమైన మాస్టర్‌ప్లాన్ రోడ్లు వీఎంఆర్‌డీఏ ద్వారా నిర్మిస్తున్నామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు 45 నుంచి 50 నిమిషాలలో చేరుకునేందుకు పలు రోడ్లను 2026 జూన్ కల్లా పూర్తిచేసే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు ప్రకటించారు. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపడతామన్నారు. మౌలిక వసతులు పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తద్వారా ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది నగరంలో కాలుష్యం తగ్గింపునకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నగరంలో 29 శాతం పచ్చదనం ఉండగా, వచ్చే మూడేళ్లలో 33 శాతానికి పెంచుతామన్నారు. ప్రస్తుత ఏడాది ఐదారు లక్షలు, వచ్చే ఏడాది నుంచి ఏటా పది లక్షలు మొక్కలు నాటుతామన్నారు. నగరం నుంచి భీమిలి వరకూ తీరంలో కోత నివారణకు వీఎంఆర్‌డీఏ ద్వారా ప్రాజెక్టులు త్వరలో చేపట్టనున్నట్టు వెల్లడించారు. కేంద్రం నగరంలో దివ్యాంగులకు స్టేడియం మంజూరుచేసిందన్నారు. నగరంలో అన్ని క్రీడా మైదానాలు, స్టేడియాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులు, యువత మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందించేకునేలాచర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నుంచి యువతను దూరం చేయడానికి క్రీడలు సాధనమని కలెక్టర్ తెలిపారు.

పేదరికాన్ని రూపుమాపేందుకు పీ-4

... 5వ పేజీ తరువాయి

గుర్తించామని, వారిని మార్గదర్శకులకు అనుసంధానం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో పది మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు. మార్గదర్శి, పీ-4 ఫౌండేషన్ అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. పరస్పర సహకారం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. తద్వారా పేదరికాన్ని జయించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం తొలుత సాయం అందించాలని, ఆ తరువాతే మిగిలిన వర్గాల నుంచి సాయం తీసుకోవాలన్నారు. పీ-4 కోసం మరోసారి సర్వే చేస్తామన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్కు స్థలం బదలాయింపుపై ఆరా

... 5వ పేజీ తరువాయి

ఆ ప్రతిపాదన ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీంతో నగరానికి చెందిన కూటమిలోని కీలక నేత ద్వారా మంత్రాంగం నడిపించారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ ఈ ఏడాది మే నెలలో గుట్టుగా మెమో జారీచేసింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 4న 'జీవీఎంసీ పార్కు పాయె' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులను సీడీఎంఏ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆరా తీసి, దానికి సంబంధించిన ఫైల్‌ను పంపించాలని ఆదేశించినట్టు తెలిసింది.

పలు ప్రత్యేక రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

తేదీల్లో విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ వెళ్లి, తిరుగు ప్రయాణంలో (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 6న విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 6, 7 తేదీల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుందని తెలిపారు.

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా: మాధవ్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

పెద్దలందరి సహకారంతో పోలవరం పూర్తవుతుందని, ఈ ప్రాంతానికి చెందిన సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను శనివారం అక్కయ్యపాలెం పోర్టు కళావాణి కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరై మాధవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, తనపై ప్రేమతో ఇంత మంది వచ్చి అభినందనలు తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ కృషిచేస్తానని, అందరితో సమన్వయంతో ముందుకు వెళతానని చెప్పారు.

పెంపుడు జంతువులతో పారాహుషార్!



కుక్క కరిస్తే రేబిస్ వ్యాప్తి

- కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కీలకం..
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు
- నేడు జునోసిస్ డే

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుక్క, పిల్లి వంటి జంతువులను చాలా మంది పెంచుకుంటూ కుటుంబ సభ్యుల మాదిరి సాకుతుంటారు. అయితే అజాగ్రత్తగా ఉంటే వీటి ద్వారా రేబిస్ వంటి వ్యాధులు సంక్రమించి, ప్రాణాకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెంపుడు జంతువుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 6న జునోసిస్ డే నిర్వహిస్తున్నారు. రేబిస్‌కు లూయీ పాశ్చర్ 1985 జూలై 6న టీకాను ప్రపంచానికి అందించడంతో అదే రోజున జునోసిస్ డేగా పాటిస్తున్నారు.

జునోటిక్ వ్యాధులు అంటే..?

జంతువుల నుంచి మనుషులకు, వారి నుంచి జంతువులకు సంక్రమించే వాటిని జునోటిక్ వ్యాధులు అంటారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా జంతువుల నుంచి వ్యాప్తి చెందుతుంటాయి. రేబిస్, లెప్టోస్పైరోసిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే దానికి రేబిస్ సోకుతుంది. రేబిస్ వైరస్ ఉన్న కుక్క, పిల్లి, ఆవు వంటి పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు రేబిస్ సోకుతుంది.

రేబిస్‌తో ప్రాణాలకు ప్రమాదం

రేబిస్ వైరస్ వీధి కుక్కల్లో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కుక్క సెలైవాలో రేబిస్ వైరస్ ఉంటుంది. కరిచిన వెంటనే సెలైవా మనిషి శరీరంలోకి వెళ్లి రేబిస్ బారినపడేలా చేస్తుంది. కుక్క కాటుకు గురైన 12 గంటల్లోగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు (జీరో డోస్), మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు డోసు తీసుకోవాలి. రేబిస్ బారినపడిన వారికి చికిత్స ఉండదు. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే వెంటనే దానికి కూడా రేబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా కాపాడవచ్చు. శరీరంలోకి వెళ్లే వైరస్ మోతాదును బట్టి ప్రమాద తీవ్రత ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

రేబిస్ వైరస్ బారినపడిన మనుషులు సొంగ కార్చడం, నీటిని, వెలుతురును చూసి భయపడడం, కుక్క మాదిరిగా అరవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైరస్ బారిన పడిన జంతువులు మనుషలను గుర్తించలేవు. కాళ్లు, చేతులు పడిపోయినట్టు ఉండడం, నడవలేకపోవడం, నీటిని తీసుకోలేకపోవడం, సొంగ కారడం, అరుస్తూ ఉండడం వంటి లక్షణాలు ఉంటాయి.

వ్యాక్సిన్ కీలకం..

ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలి. కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కూడా అత్యంత కీలకం. నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ప్రాణాలకు ప్రమాదం.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించడం అవసరం



కొన్ని రకాల జంతువులను పెంచుకునే అలవాటు కొందరిలో పెరిగింది. అయితే, కుక్క, పిల్లి వంటి జంతువులను పెంచుకునే వారు వీధి కుక్కలతో వీటిని కలకుండా చూసుకోవాలి. వీటి ద్వారా రేబిస్ వైరస్ బారినపడే ప్రమాదం ఉంది. ఒకసారి రేబిస్ బారినపడితే చాలా ప్రమాదం. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కాటుకు గురైన వ్యక్తి 12 గంటల్లోగా వ్యాక్సిన్ తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. జునోసిస్ డేను పురస్కరించుకుని కోర్టు సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కె.బసవారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్

వేడుకగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర



వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ సర్కిల్‌లోని జగన్నాథుడి తిరుగు ప్రయాణ రథయాత్ర

సిరిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర ఆలిండియా రేడియో సమీపంలోని ఉత్కల్ సంస్కృత్ సమాజ్ ఆలయానికి శనివారం చేరుకున్నారు. లాసన్స్ బే కాలనీలోని గుండిచా ఆలయానికి జూన్ 27న రథయాత్ర ద్వారా తొమ్మిది రోజుల పాటు విహారయాత్రకు వెళ్లి అక్కడ ప్రజలకు దర్శనమిచ్చారు. తిరిగి ప్రయాణంలోని బహుద జాతరను నిర్వహించారు. దేవతలను పహండి బిజే అనే ఉత్సవంలోని రంగురంగుల పూలతో అలకరించిన రథం వద్దకు తీసుకొచ్చారు. రథ వేదికను తుడిచిపెట్టిన తరువాత సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ భక్తులు కలిసి మంత్రోచ్చరణలు, సంకీర్తనల నడుమ రథాన్ని లాగారు. ఒడిశా ప్రభుత్వం రాయగడ నుంచి గాయత్రి కళా సంగథన్‌ను తీసుకొచ్చిన ధింసా, ఒడిస్సీ కూడిపూడి వంటి వివిధ కళాకారులు నృత్యాలు చేశారు. రథయాత్ర శాంతి ఆశ్రమం నుంచి వుడా పార్కు, రైల్వేగెస్ట్ హౌస్, ఏయూ గేట్, సిరిపురం హిందూస్థాన్ పెట్రోల్ మీదుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్ నుంచి ఆలయానికి వైభవంగా చేరుకుందని సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ తెలిపారు. ప్రధాన ఆలయానికి చేరుకున్న జగన్నాథుడికి రసగుల్లాలు ఇచ్చి దేవి లక్ష్మిని శాంతింపజేసే ఆచారం నిర్వహించడం జరిగిందన్నారు. తదుపరి ఆయన, తోబుట్టువులు గర్భగుడిలోకి ప్రవేశించడానికి తలుపులు తెరవడం జరిగిందన్నారు. రథయాత్ర వేడుకను విజయవంతం చేసేందుకు సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

8 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 8న శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి సెక్షన్ పరిధిలో, 10న పాలకొండలో, 17న విశాఖపట్నం జోన్-3 డివిజన్ పద్మనాభం సెక్షన్‌లో , 24న రాజమండ్రి రూరల్ డివిజన్ కడియం సెక్షన్‌లో, 27న జంగారెడ్డిగూడెం డివిజన్ జీలుగుమిల్లి సెక్షన్ కార్యాలయంలో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో తనతో పాటు కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఐజీ శ్రీనివాసరావు



ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు శనివారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో పలు విభాగాలను పరిశీలించారు. జైలు పరిసరాలు అంతా సందర్శించారు. జైలులో ఖైదీలను కలసి మాట్లాడారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదరణ విజిట్ భాగంగా జైలు సందర్శించినట్టు తెలిపారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

బ్యాగ్ ఒకెద

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

విమ్స్‌ను విస్తరించి వైద్య సేవలు మెరుగుపరుస్తాం

- ఎంపీ శ్రీభరత్



విమ్స్‌లో ఆర్వో ప్లాంట్లు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి, డైరెక్టర్ రాంబాబు తదితరులు

ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆసుపత్రి ఆవరణ విశాలంగా ఉన్నందున విస్తరణకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీ శ్రీభరత్ అన్నారు. విమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తలసేమియా వార్డు, సదరం కేంద్రం, లిఫ్ట్, దివీస్ లేబొరేటరీ సమకూర్చిన మూడు ఆర్వో ప్లాంట్లను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విమ్స్‌లో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చడానికి సుముఖంగా ఉందన్నారు. దివ్యాంగుల సౌలభ్యం కోసం విమ్స్ ఆసుపత్రిలో వారానికి రెండు రోజులు సదరం క్యాంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. డైరెక్టర్ రాంబాబు, ఎమ్మెల్యే రామకృష్ణబాబులు విమ్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అన్నారు. దివీస్ యాజమాన్యం రూ.48 లక్షలతో మూడు ఆర్వో ప్లాంట్లను సమకూర్చిందని తెలిపారు.

కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, మేనేజర్ సురేష్ కుమార్, కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కెల్ల సునీత, టీడీపీ నాయకుడు ఒమ్మి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై సర్వత్రా సంతృప్తి

- ప్రజాస్పందన చూస్తోంటే ఆనందం కలుగుతోంది
- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



వెంకోజీపాలెం : 15వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఆరిలోవ : 12వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కూటమి పాలన పట్ల ప్రజల్లో చక్కని స్పందన కనిపించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 15వ వార్డులోని వెంకోజీపాలెం ప్రాంతంలో శనివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, టీడీపీ సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే చాలా వరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, మిగిలినవి కూడా అతి త్వరలో పూర్తిగా అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెల్లుబోయిన గోవింద్, కర్రి గౌరీ, వరలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, అధ్యక్షులు కర్రి వెంకట అప్పారావు, ఉపాధ్యక్షులు పెంటకోట ప్రకాష్ ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి సీతారామాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేకు శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం తరుపున హెచ్‌బీకాలనీ నుంచి వెంకోజీపాలెం హైవే వరకు వీఎంఆర్‌డీఏ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణను నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ముత్యాలరాజు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల 23, 27 బూత్ నెంబరుకు చెందిన దుర్గానగర్, నెహ్రూనగర్‌లో శనివారం కూటమి పార్టీ నేతలు సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఆ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, గత ఏడాదిగా చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అర్హులై ఉన్నప్పటికీ ఏవైనా పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. వారికి ఆయా పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాడి సత్యం, ఒమ్మి పోలారావు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అలాగే 11వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కృష్ణంరాజు, సీనియర్ నేతలు ఆదినారాయణ, ఎర్రాజీ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పారిశుధ్యం పనులు తనిఖీ చేసిన జీవీఎంసీ కమిషనర్

- నిబద్ధతతో విధులు నిర్వహించి నగరాన్ని శుభ్రంగా ఉంచాలని సూచన



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 5(ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన రామటాకీస్, సౌత్ జైల్ రోడ్డు, సిరిపురం, పాండురంగాపురం, హార్బర్ పార్కు, రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, 15వ రాత్రి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పోర్టు రోడ్డు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల ఏయే ప్రదేశాల్లో ఎంతమంది కార్మికులు విధులను నిర్వహిస్తున్నారో వారి విధి విధానాలను పరిశీలించారు. సౌత్ జైల్ రోడ్డు మార్గంలో 15వ ప్యాకేజీ రాత్రి పారిశుధ్య పనులను తనిఖీ చేసి, పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ నిత్యం రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు లేకుండా పరిశుభ్రపరిచి నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. నగరంలో ప్రతి రోడ్డులో వ్యర్థాలు లేకుండా శుభ్రపరిచి వెనువెంటనే వాటిని డంపింగ్ యార్డుకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నేతాజీ



ఎంవీపీ కాలనీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ నూతన అధ్యక్షుడిగా చింతా నేతాజీ ఎన్నికైనట్టు క్లబ్ 3020 పూర్వ గవర్నర్ సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. గత ఏడాది ఇదే క్లబ్‌కు కార్యదర్శిగా చింతా నేతాజీ బాధ్యతలను నిర్వర్తించినట్టు పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనుందని తెలిపారు. నూతన కమిటీ సెక్రటరీగా పి.భాస్కర నరేంద్ర జగన్, కోశాధికారిగా టి.సురేష్, ఉపాధ్యక్షులుగా టి.కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వి.ప్రవీణ్, డైరెక్టర్లుగా ఎస్.వెంకటేష్, బి.శంకరరావు, ఎస్.సునీల్‌కుమార్, డాక్టర్ అశోక్ దేవరకొండ, కె.ఫిరోజ్‌ఖాన్, కె.ఎం. కె.రమేష్, ఎండీ యాసిన్, బచ్చు బ్రహ్మానందం, పి.నాగరాజు, ఎస్.కృష్ణకుమారి, ఎ.ప్రభుజనార్దన్, ఎం.డి. యామిన్, బి.మురళీకృష్ణ ఎన్నికైనట్టు తెలిపారు.

హోటల్ గ్రీన్ పార్కులో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



సిల్క్ ఎక్స్‌పోలో యువతి సందడి

రామ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకల సీజన్ నేపథ్యంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలుకళకళ ప్రతిబింబించేలా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను హోటల్ గ్రీన్ పార్కులో ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీర బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి ప్రదర్శనలో ఒకే చోట అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. మహారాష్ట్ర పైథానీ, బెంగళూర్ సిల్క్, మధ్యప్రదేశ్ చందేరీ, తమిళనాడు కాంజీవరం, జమ్ముకశ్మీర్ తాబి సిల్క్ చీరలు, రాజస్థాన్ బాందినీతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పట్టువస్త్రాలు ప్రదర్శనలో లభిస్తాయని తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉచితమని తెలిపారు. నగర వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మిస్ గ్రాండ్ సీ వరల్డ్ విజేత దిశా

- దుబాయ్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో సత్తాచాటిన విశాఖ యువతి



విజతగా నిలిచిన దిశా పల్నాటి

సిరిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో జరిగిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ 2025 పోటీల్లో విశాఖపట్నం యువతి దిశా పల్నాటి విజేతగా నిలిచారు. 19 దేశాల నుంచి 60 మంది పోటీదారులు పాల్గొన్న ఈ 11వ ఎడిషన్‌లో దిశా భారత్‌కు ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచింది. దిశా పల్నాటి పాఠశాల విద్యను నగరంలోని వివిధ పాఠశాలల్లో పూర్తి చేసి ప్రస్తుతం జైపూర్‌లోని మణిపాల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. అందం, సాంస్కృతిక సంబంధాల ఔన్నత్యం ప్రధాన ఇతివృత్తంగా నిర్వహించే ఈ పోటీల్లో ఆమె 12 నుంచి 18 ఏళ్ల యువతులకు మధ్య జరిగే టీన్స్ కాంటెస్ట్‌లో మిస్ గ్రాండ్ సీ వరల్డ్ 2025 టైటిల్‌తో పాటు ఉత్తమ జాతీయ కాస్ట్యూమ్ అవార్డునూ సొంతం చేసుకోవడం విశేషం. ఈ పోటీల్లో దిశా మన భారతదేశ జాతీయ పక్షి నెమలిని పోలిన తలపాగాతో పాటు తాజ్‌మహల్, ఇతర జాతీయ ప్రాధాన్యం కలిగిన చిత్రాలతో కూడిన పతాకాన్ని ప్రదర్శించి జూరీ ప్రశంసలు సైతం అందుకుంది.

వైద్యుని ఇంట్లో చోరీ : పనిమనిషి అరెస్టు

- 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన మహిళను క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 17 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌లో రవీంద్రభారతి స్కూల్ సమీపంలోని ఓ ఫ్లాటులో నివసిస్తున్న మండపాటి రాఘవేంద్ర విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో గల గురుదేవ్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య నగరంలోని ఎన్‌టీఈపీలో కన్సల్టెంట్. మూడేళ్ల క్రితం తమ ఇంట్లో పనులు చేసేందుకు గాను వేపగుంటలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన తనుబుద్ధి సత్యవతి (45)ని పనిమనిషిగా పెట్టుకున్నారు. పనిమనిషి నమ్మకంగా ఉండడంతో కొంతకాలం కిందట ఆమెను తమ ఇంట్లోనే ఉండమన్నారు. ఈ క్రమంలో గతనెల 25న విధులకు వెళ్లి వచ్చిన రాఘవేంద్ర దుస్తులు తీద్దామని చూడగా బీరువా తెరిచి ఉండడంతో పాటు లాకర్‌లో భద్రపరిచిన 17 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పనిమనిషే చోరీకిపాల్పడి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ సూరిబాబు... సత్యవతిని తమదైన శైలిలో విచారించడంతో నేరం చేసినట్టు అంగీకరించింది. తన కుమార్తె వద్ద చోరీ సొత్తును భద్రపరిచానని చెప్పడంతో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచారం గృహంపై పోలీసుల దాడి : ముగ్గురి అరెస్టు

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జనావాసాలు గల కాలనీలో భార్యాభర్తలుగా చెప్పుకుని అద్దెకు దిగిన ఇంట్లో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శనివారం పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీశెట్టి ధనలక్ష్మి అనే మహిళతో సహజీవనం చేస్తున్న వివేక్ తాము భార్యాభర్తలమని చెప్పి సుజాతనగర్ రత్నగిరినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను ధనలక్ష్మి ఇక్కడకు తీసుకువచ్చి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తుంది. స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో కొద్ది రోజులుగా నిఘా పెట్టి శనివారం గుట్టురట్టు చేశారు. నిర్వాహకురాలు ధనలక్ష్మి, వివేక్‌తో పాటు ఒక విటుడు, ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, బాధిత యువతులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక స్వధార్ హోమ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

ఫిషింగ్ బోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగించాలి

- మత్స్య శాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు



ఫిషింగ్ బోట్లలో ఏర్పాటు చేయనున్న ట్రాన్స్‌పాండర్స్

బీచ్ రోడ్డు, జూలై 5, (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ బోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగించాలని మత్స్య శాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్‌లో గల మెకనైజ్డ్ బోట్లకు వంద శాతం రాయితీపై ట్రాన్స్‌పాండర్స్ సరఫరా చేసిందన్నారు. సుమారు 634 మంది బోట్లకు ట్రాన్స్‌పాండర్స్‌ను అమర్చడం జరిగిందని వెల్లడించారు. ట్రాన్స్‌పాండర్ అనేది వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరమని, నాభి మిత్ర కమ్యూనికేషన్ సిస్టమ్ అనేది శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ తద్వారా ఫిషింగ్ బోట్లను మోనిటరింగ్ కంట్రోల్ సర్వేలైన్స్ చేయవచ్చన్నారు. ట్రాన్స్‌పాండర్ ద్వారా సముద్రంలో బోటు ఏ స్థానంలో ఉందో తెలుసుకోవచ్చని, నాభిమిత్ర యాప్ ద్వారా సముద్రంపై ఫిషింగ్‌లో గల బోట్ల సంఖ్య స్థానం తెలుసుకునే వీలుంటుందన్నారు. రాబోయే 5 నెలల్లో తుపాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమ బోట్లలో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అలాగే మన దేశ సముద్ర జలాలను దాటినప్పుడు అలారం వలే పని చేస్తుందని వెల్లడించారు. బోట్లలో అమర్చిన ట్రాన్స్‌పాండర్లను ఎల్లవేళలా ఆన్ చేసి ఉంచాలని కోరారు.

రోగులకు అందుబాటులో ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు

- కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉంచి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిదులతో శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రిని సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పరుస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధి విధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూ ఆ ఆస్పత్రిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఏఎంజీ ఫౌండేషన్ వారు నిర్వహిందుకు ఆసక్తితో ముందుకు రావడం సంతోషదాయకమని, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచేలా తక్కువ ఫీజులు వసూలు చేయాలని, వారికి శ్రీహరిపురం ఎఫ్‌ఆర్‌యూ ఆసుపత్రి నిర్వహణపై కొన్ని ప్రతిపాదనలను సూచించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఈ సూచనలపై ఏఎంజీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే విషయాన్ని తెలియపరుస్తామని కమిషనర్‌కు తెలిపారు. ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రికి సంబంధించిన అంశంపై గతంలో కౌన్సిల్లో చర్చించామని. దానికి అనుగుణంగా ప్రజలకు ఎఫ్‌ఆర్‌యూ సెంటర్ లీజు అగ్రిమెంటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవల ఫీజుల వసూలు, మెరుగైన వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించడం జరిగిందని కమిషనర్ తెలిపారు.

కేజీహెచ్ ఏవోగా సత్యనారాయణ



బాధ్యతలు చేపట్టిన జి.సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సత్యనారాయణ పరిపాలన విభాగ అధికారి(ఏవో)గా పదోన్నతి పొందారు. ఆయన శనివారం ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఏవోగా పని చేసిన మంగరాజు సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, ఆస్పత్రి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా: మాధవ్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దలందరి సహకారంతో పోలవరం పూర్తవుతుందని, ఈ ప్రాంతానికి చెందిన సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను శనివారం అక్కయ్యపాలెం పోర్టు కళావాణి కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరై మాధవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, తనపై ప్రేమతో ఇంత మంది వచ్చి అభినందనలు తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ కృషిచేస్తానని, అందరితో సమన్వయంతో ముందుకు వెళతానని చెప్పారు.

ఇప్పుడున్నది ప్రజల ప్రభుత్వం: ఎంపీ భరత్



48వ వార్డులో ప్రజలతో సంభాషిస్తున్న ఎంపీ శ్రీభరత్

కంచరపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వమని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. జీవీఎంసీ 48, 49 వార్డుల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినా ముఖ్యమంత్రి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువచేస్తున్నారన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గండి బాబ్జీ, నజీర్, లొడగల కృష్ణ, పి.శ్రీనివాస్, సత్యాడ అప్పారావు, ఈతలపాక సుజాత, జయశ్రీ, నాగమణి పాల్గొన్నారు.

ఏఐ, ఆటోమేషన్‌లతో ఉద్యోగ అవకాశాలు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఆటోమేషన్ తెలిసిన వారికే ఉద్యోగ అవకాశాలు త్వరగా వస్తాయని అందుకు తగ్గట్టుగా విద్యా సంస్థలు సిలబస్‌ను మార్చుకొని పరిశ్రమకు అవసరమైన వారిని తయారు చేయాలని సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) - ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) కలిసి 'ఏఐ విప్లవం-విద్యా సంస్థల బాధ్యత' అనే అంశంపై నోవాటెల్‌లో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు జి.మురళీకృష్ణ అధ్యక్షత వహించగా, ఎస్‌టీపీఐ అడిషనల్ డైరక్టర్ సురేశ్ బేతా, ఐటాప్ అధ్యక్షురాలు లక్ష్మి, ఐటాప్ ఫౌండర్ రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. సుమారుగా 200 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల రద్దుకు డిమాండ్



ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీల తగ్గింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరణ, అదానీ, సెకీ సంస్థలతో జరిగిన విద్యుత్ ఒప్పందాల రద్దు డిమాండ్లతో సీతమ్మధారలో గల ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదాని, సెకీ సంస్థలతో ఒప్పందాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీల్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది గడిచినా విద్యుత్ చార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను చెల్లించుకోలేక గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే, మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు మరచి కార్పొరేట్ సంస్థలకు ప్రజల కష్టార్జితాన్ని దోచిపెట్టే విధానాలను కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. చార్జీలు తగ్గించే వరకు వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలతో కలిసి ప్రజలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సీఎన్ క్షేత్రపాల్, సత్యాంజనేయ, వనజాక్షి, ఆర్.శ్రీనివాస్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఔషధ దుకాణాల్లో తనిఖీలు



ఓ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అధికారులు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే మందులు అమ్ముతున్న ఔషధ దుకాణాల్లో విశాఖ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. విశాఖ డ్రగ్ కంట్రోల్ అథారిటీ సిబ్బందికి అందిన సమాచారం మేరకు గోపాలపట్నం, మద్రిపాలెం తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశామన్నారు. పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిషేధిత ఔషధాలను సీజ్ చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజలకు సత్వర న్యాయమే లోక్‌అదాలత్ లక్ష్యం

» జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా



నష్ట పరిహారం చెల్లింపు చెక్కు చూపుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నం శెట్టి రాజా, ఇతర ప్రముఖులు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం అందించడమే న్యాయ ప్రాధికార సంస్థ లక్ష్యమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నం శెట్టి రాజా అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని నమ్మి భవిష్యత్‌లో కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు న్యాయ సేవ ప్రాధికార సంస్థ సేవలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో రాజీకి 37 బెంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. చోళమండల బీమా సంస్థకు సంబంధించిన ఒక కేసులో రికార్డు స్థాయిలో రూ.80 లక్షల నష్ట పరిహారం, మరో డిజిటల్ సంస్థ కేసులో రూ.75 లక్షల నష్టపరిహారం ఇప్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల కేసులు గుర్తించగా 9,714 కేసులను రాజీ చేశామని చిన్నంశెట్టి రాజా చెప్పారు. ఈ సమావేశంలో ఆర్.సన్యాసినాయుడు, ఎంకే శ్రీనివాస్, ఎస్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



వన్‌టౌన్ టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథుడు శనివారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దశమి కావడంతో స్వామి వారికి ఆలయ అర్చకులు విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ఉత్సవాలు ముగియనుండడంతో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

-మహారాణిపేట/ఆంధ్రజ్యోతి

కేజీహెచ్‌కు అవినీతి జబ్బు

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులకు సదరు అధికారి స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక్కొక్కరూ రూ.20 వేలు చొప్పున రెండు విడతల్లో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారికి సమర్పించారు. రోజులు గడుస్తున్నా డబ్బులు తీసుకున్న అధికారి ఉద్యోగాన్ని కల్పించకపోవడంతో వారంతా కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. డబ్బులు తీసుకున్నారని, ఉద్యోగం కూడా ఇవ్వలేదని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే, ఎన్‌టీఆర్ వైద్యసేవలో పనిచేసే సుమారు 50 మంది ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కోస్)లోకి మార్పిస్తామంటూ ఆస్పత్రి అధికారి ఒకరు డబ్బులు తీసుకున్నారంటూ వసూలు చేశారంటూ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. రెండు వేర్వేరు వ్యవహారాల్లో ఆస్పత్రికి చెందిన ఉద్యోగులపై ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని వివరణ కోరగా..తన దృష్టికి సమస్య రాలేదన్నారు. ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడిన వసూలుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోపణలపై దృష్టిసారించరా..?

కేజీహెచ్‌లో పనిచేసే ఉద్యోగుల నుంచి అధికారులు డబ్బులు తీసుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణ చేయాల్సిన అవసరం ఉంది. వెంటనే విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కొద్దిరోజుల కిందట ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు దీనిపై దృష్టిసారించకపోవడం గమనార్హం.

కోలాహలంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర



మురళీనగర్‌లో ఉత్సవ రథంపై స్వామి వారు



తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తజన సందోహం

మురళీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మురళీనగర్‌లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జగన్నాథుని తిరుగు రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరుని ఆలయం నుంచి ఆరంభమైన యాత్రలో విశాఖపట్నం హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించన భక్తదాస పాల్గొన్నారు. అలంకృత రథంలో ఆసీనులైన జగన్నాథస్వామిని భక్తులు వేలాదిగా దర్శించుకున్నారు. రథం లాగుతూ ముందుకు కదిలారు. రాత్రి 9 గంటలకు మాధవధార 48ఎ బస్ రూట్ నుంచి ఉడాకాలనీలోని వీఎంఆర్డీఏ కల్యాణమండపానికి రథం చేరుకోవడంతో ఉత్సవాన్ని ముగించారు. కీర్తనలు, సంప్రదాయ నృత్యాల నడుమ రథయాత్ర శోభాయమానంగా సాగింది.

పంచాయతీల అభివృద్ధి సూచీపై సదస్సు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంచాయతీల అభివృద్ధిలో 22 సూచికలు, 9 థీమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. పంచాయతీ అభివృద్ధి సూచికపై జిల్లా పరిషత్ సమావేశమందిరంలో శనివారం నిర్వహించిన అవగాహన సదుస్సులో ఆయన మాట్లాడారు. అలాగే డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి సూచిక గురించి పూర్తిగా తెలుసుకుని పంచాయతీరాజ్ శాఖ ప్రదానం చేసే జాతీయ అవార్డులు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

10న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శనివారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,385 పాఠశాలల్లో 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులతో హాజరుకావాలని సూచించారు.

మసీదు వద్ద మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం



వన్‌టౌన్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు, మసీదుల ఎదుట వైన్‌షాపులు పెట్టవద్దని డిమాండ్ చేస్తూ వన్‌టౌన్‌లో స్థానికులు శనివారం ఆందోళన చేపట్టారు. కన్యకాపరమేశ్వరీ ఆలయానికి ఎదురుగా, మసీదుకు 50-60 అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలంటూ ధర్నా చేశారు. కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, టీడీపీ నాయకుడు నరసింహాచారి స్థానికులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కురుపాం మార్కెట్‌లో వైన్‌షాపు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, గుడి, మసీదు ఉన్న పరిసరాల్లో వైన్‌షాపు ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. వైన్‌షాపు మూతపడే వరకు ఆందోళన నిర్వహిస్తామని ప్రకటించారు.

బటర్‌ఫ్లై పార్కు స్థలం బదలాయింపుపై ఆరా

(5వ పేజీ తరువాయి)

ఆ ప్రతిపాదన ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీంతో నగరానికి చెందిన కూటమిలోని కీలక నేత ద్వారా మంత్రాంగం నడిపించారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ ఈ ఏడాది మే నెలలో గుట్టుగా మెమో జారీచేసింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 4న 'జీవీఎంసీ పార్కు హాయె' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులను సీడీఎంఏ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆరా తీసి, దానికి సంబంధించిన ఫైల్‌ను పంపించాలని ఆదేశించినట్టు తెలిసింది.

పర్యాటకం, ఐటీ, విద్యా రంగాలు

(5వ పేజీ తరువాయి)

కలిగాయని, అయితే నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సహకారంతో సజావుగా సాగి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. నగరానికి కొత్తగా వచ్చిన డబుల్ డెక్కర్ బస్సులు వారం, పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలో ప్రధానంగా మూడు రంగాలపై దృష్టిసారించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఉపాధి అవకాశాలు విస్తృతం చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలంటే పర్యాటకం, ఐటీ, విద్యా రంగాల్లో కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పర్యాటకానికి సంబంధించి అతిథ్య రంగం విస్తరణకు రానున్న రెండు, మూడేళ్లలో నగరంలో పేరున్న పది హోటళ్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే వరుణ్‌బీచ్, అన్నవరంలో ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా మే ఫ్రంట్ హోటల్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. దీనివల్ల యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు నగరానికి రావడంతో వ్యాపారాలు పెరుగుతాయని తద్వారా ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. విశాఖను ఐటీ నగరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కొత్త సంస్థలను ఆహ్వానించి భూములు కేటాయిస్తామన్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణ చేపట్టామన్నారు. టీసీఎస్ ఈ ఏడాదిలోనే విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నదని, తొలిదశలో రెండు వేల మందిని నియమించుకుంటుందన్నారు. రానున్న రెండు, మూడేళ్లలో పది వేల మందితో కార్యకలాపాలు విస్తరించనున్నదని తెలిపారు. మరికొన్ని ఐటీ సంస్థలు విశాఖ కేంద్రంగా సేవలు అందించడానికి ముందుకువస్తున్నాయన్నారు. పర్యాటకం, ఐటీ రంగాలు, ఇతర రంగాలు ఏర్పాటుకావాలంటే అక్కడ పనిచేయడానికి అవసరమైన నిపుణులు అవసరమని పేర్కొన్నారు. దీనికోసం విద్యా రంగంపై ఫోకస్ పెట్టామన్నారు. భోగాపురం సమీపాన సివిల్ ఏవియేషన్ వర్సిటీ రానున్నదని సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. టెక్నాలజీ రంగంలో పేరున్న విద్యా సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని, వీరి కోసం భూమి సిద్ధం చేశామన్నారు. విశాఖ అభివృద్ధి కోసం ఎంతో కీలకమైన మాస్టర్‌ప్లాన్ రోడ్లు వీఎంఆర్‌డీఏ ద్వారా నిర్మిస్తున్నామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు 45 నుంచి 50 నిమిషాలలో చేరుకునేందుకు పలు రోడ్లను 2026 జూన్‌కల్లా పూర్తిచేసే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు ప్రకటించారు. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపడతామన్నారు. మౌలిక వసతులు పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తద్వారా ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది నగరంలో కాలుష్యం తగ్గింపునకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నగరంలో 29 శాతం పచ్చదనం ఉండగా, వచ్చే మూడేళ్లలో 33 శాతానికి పెంచుతామన్నారు. ప్రస్తుత ఏడాది ఐదారు లక్షలు, వచ్చే ఏడాది నుంచి ఏటా పది లక్షలు మొక్కలు నాటుతామన్నారు. నగరం నుంచి భీమిలి వరకూ తీరంలో కోత నివారణకు వీఎంఆర్‌డీఏ ద్వారా ప్రాజెక్టులు త్వరలో చేపట్టనున్నట్టు వెల్లడించారు. కేంద్రం నగరంలో దివ్యాంగులకు స్టేడియం మంజూరుచేసిందన్నారు. నగరంలో అన్ని క్రీడా మైదానాలు, స్టేడియాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులు, యువత మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందించేకునేలా చేస్తామన్నారు. గంజాయి నుంచి యువతను దూరం చేయడానికి క్రీడలు ప్రధాన సాధనమని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

(5వ పేజీ తరువాయి)

వివరాలపై గందరగోళం నెలకొంది. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నా హాజరు వేయడం లేదు. దీనిపై మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలో ప్రైవేటు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినా ఎక్కువమంది పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు హాజరు వేయకపోవడంతో తల్లికి వందనం పథకం వర్తించదని ఉపాధ్యాయులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పలు ప్రత్యేక రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

తేదీల్లో విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ వెళ్లి, తిరుగు ప్రయాణంలో (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 6న విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 6, 7 తేదీల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుందని తెలిపారు.

పేదరికాన్ని రూపుమాపేందుకు పీ-4

(5వ పేజీ తరువాయి)

గుర్తించామని, వారిని మార్గదర్శకులకు అనుసంధానం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో పది మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు. మార్గదర్శి పీ-4 ఫౌండేషన్ అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. పరస్పర సహకారం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. తద్వారా పేదరికాన్ని జయించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం తొలుత సాయం అందించాలని, ఆ తరువాత మిగిలిన వర్గాల నుంచి సాయం తీసుకోవాలన్నారు. పీ-4 కోసం మరోసారి సర్వే చేస్తామన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, అధికారులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో పారాహుషార్!



కుక్క కరిస్తే రేబిస్ వ్యాప్తి

- కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కీలకం..
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు
- నేడు జునోసిస్ డే

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుక్క, పిల్లి వంటి జంతువులను చాలా మంది పెంచుకుంటూ కుటుంబ సభ్యుల మాదిరి సాకుతుంటారు. అయితే అజాగ్రత్తగా ఉంటే వీటి ద్వారా రేబిస్ వంటి వ్యాధులు సంక్రమించి, ప్రాణాకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెంపుడు జంతువుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 6న జునోసిస్ డే నిర్వహిస్తున్నారు. రేబిస్‌కు లూయీ పాశ్చర్ 1985 జూలై 6న టీకాను ప్రపంచానికి అందించడంతో అదే రోజున జునోసిస్ డేగా పాటిస్తున్నారు.

జునోటిక్ వ్యాధులు అంటే..?

జంతువుల నుంచి మనుషులకు, వారి నుంచి జంతువులకు సంక్రమించే వాటిని జునోటిక్ వ్యాధులు అంటారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా జంతువుల నుంచి వ్యాప్తి చెందుతుంటాయి. రేబిస్, లెప్టోస్పైరోసిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే దానికి రేబిస్ సోకుతుంది. రేబిస్ వైరస్ ఉన్న కుక్క, పిల్లి, ఆవు వంటి పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు రేబిస్ సోకుతుంది.

రేబిస్‌తో ప్రాణాలకు ప్రమాదం

రేబిస్ వైరస్ వీధి కుక్కల్లో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కుక్క సెలైవాలో రేబిస్ వైరస్ ఉంటుంది. కరిచిన వెంటనే సెలైవా మనిషి శరీరంలోకి వెళ్లి రేబిస్ బారినపడేలా చేస్తుంది. కుక్క కాటుకు గురైన 12 గంటల్లోగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు (జీరో డోస్), మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు డోసు తీసుకోవాలి. రేబిస్ బారినపడిన వారికి చికిత్స ఉండదు. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే వెంటనే దానికి కూడా రేబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా కాపాడవచ్చు. శరీరంలోకి వెళ్లే వైరస్ మోతాదును బట్టి ప్రమాద తీవ్రత ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

రేబిస్ వైరస్ బారినపడిన మనుషులు సొంగ కార్చడం, నీటిని, వెలుతురును చూసి భయపడడం, కుక్క మాదిరిగా అరవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైరస్ బారిన పడిన జంతువులు మనుషులను గుర్తించలేవు. కాళ్లు, చేతులు పడిపోయినట్టు ఉండడం, నడవలేకపోవడం, నీటిని తీసుకోలేకపోవడం, సొంగ కారడం, అరుస్తూ ఉండడం వంటి లక్షణాలు ఉంటాయి.

వ్యాక్సిన్ కీలకం..

ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలి. కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కూడా అత్యంత కీలకం. నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ప్రాణాలకు ప్రమాదం.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించడం అవసరం



కొన్ని రకాల జంతువులను పెంచుకునే అలవాటు కొందరిలో పెరిగింది. అయితే, కుక్క, పిల్లి వంటి జంతువులను పెంచుకునే వారు వీధి కుక్కలతో వీటిని కలకుండా చూసుకోవాలి. వీటి ద్వారా రేబిస్ వైరస్ బారినపడే ప్రమాదం ఉంది. ఒకసారి రేబిస్ బారినపడితే చాలా ప్రమాదం. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కాటుకు గురైన వ్యక్తి 12 గంటల్లోగా వ్యాక్సిన్ తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. జునోసిస్ డేను పురస్కరించుకుని కోర్టు సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ కె.బసవారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్

వేడుకగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర



వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ సర్కిల్‌లోని జగన్నాథుడి తిరుగు ప్రయాణ రథయాత్ర

సిరిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్ర ఆలిండియా రేడియో సమీపంలోని ఉత్కల్ సంస్కృత్ సమాజ్ ఆలయానికి శనివారం చేరుకున్నారు. లాసన్స్ బే కాలనీలోని గుండిచా ఆలయానికి జూన్ 27న రథయాత్ర ద్వారా తొమ్మిది రోజుల పాటు విహారయాత్రకు వెళ్లి అక్కడ ప్రజలకు దర్శనమిచ్చారు. తిరిగి ప్రయాణంలోని బహుద జాతరను నిర్వహించారు. దేవతలను పహండి బిజే అనే ఉత్సవంలోని రంగురంగుల పూలతో అలకరించిన రథం వద్దకు తీసుకొచ్చారు. రథ వేదికను తుడిచిపెట్టిన తరువాత సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ భక్తులు కలిసి మంత్రోచ్చరణలు, సంకీర్తనల నడుమ రథాన్ని లాగారు. ఒడిశా ప్రభుత్వం రాయగడ నుంచి గాయత్రి కళా సంగథన్‌ను తీసుకొచ్చిన ధింసా, ఒడిస్సీ కూడిపూడి వంటి వివిధ కళాకారులు నృత్యాలు చేశారు. రథయాత్ర శాంతి ఆశ్రమం నుంచి వుడా పార్కు, రైల్వేగెస్ట్ హౌస్, ఏయూ గేట్, సిరిపురం హిందూస్థాన్ పెట్రోల్ మీదుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్ నుంచి ఆలయానికి వైభవంగా చేరుకుందని సమాజ్ అధ్యక్షుడు జేకే నాయక్ తెలిపారు. ప్రధాన ఆలయానికి చేరుకున్న జగన్నాథుడికి రసగుల్లాలు ఇచ్చి దేవి లక్ష్మిని శాంతింపజేసే ఆచారం నిర్వహించడం జరిగిందన్నారు. తదుపరి ఆయన, తోబుట్టువులు గర్భగుడిలోకి ప్రవేశించడానికి తలుపులు తెరవడం జరిగిందన్నారు. రథయాత్ర వేడుకను విజయవంతం చేసేందుకు సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్యుని ఇంట్లో చోరీ : పనిమనిషి అరెస్టు

- 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన మహిళను క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 17 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌లో రవీంద్రభారతి స్కూల్ సమీపంలోని ఓ ఫ్లాటులో నివసిస్తున్న మండపాటి రాఘవేంద్ర విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో గల గురుదేవ్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య నగరంలోని ఎన్‌టీఈపీలో కన్సల్టెంట్. మూడేళ్ల క్రితం తమ ఇంట్లో పనులు చేసేందుకు గాను వేపగుంటలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన తనుబుద్ధి సత్యవతి (45)ని పనిమనిషిగా పెట్టుకున్నారు. పనిమనిషి నమ్మకంగా ఉండడంతో కొంతకాలం కిందట ఆమెను తమ ఇంట్లోనే ఉండమన్నారు. ఈ క్రమంలో గతనెల 25న విధులకు వెళ్లి వచ్చిన రాఘవేంద్ర దుస్తులు తీద్దామని చూడగా బీరువా తెరిచి ఉండడంతో పాటు లాకర్‌లో భద్రపరిచిన 17 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పనిమనిషే చోరీకిపాల్పడి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సూరిబాబు... సత్యవతిని తమదైన శైలిలో విచారించడంతో నేరం చేసినట్టు అంగీకరించింది. తన కుమార్తె వద్ద చోరీ సొత్తును భద్రపరిచానని చెప్పడంతో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచారం గృహంపై పోలీసుల దాడి : ముగ్గురి అరెస్టు

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జనావాసాలు గల కాలనీలో భార్యాభర్తలుగా చెప్పుకుని అద్దెకు దిగిన ఇంట్లో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శనివారం పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీశెట్టి ధనలక్ష్మి అనే మహిళతో సహజీవనం చేస్తున్న వివేక్ తాము భార్యాభర్తలమని చెప్పి సుజాతనగర్ రత్నగిరినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను ధనలక్ష్మి ఇక్కడకు తీసుకువచ్చి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తుంది. స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో కొద్ది రోజులుగా నిఘా పెట్టి శనివారం గుట్టురట్టు చేశారు. నిర్వాహకురాలు ధనలక్ష్మి, వివేక్‌తో పాటు ఒక విటుడు, ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, బాధిత యువతులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక స్వధార్ హోమ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

ఫిషింగ్ బోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగించాలి

- మత్స్య శాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు



ఫిషింగ్ బోట్లలో ఏర్పాటు చేయనున్న ట్రాన్స్‌పాండర్స్

బీచ్ రోడ్డు, జూలై 5, (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ బోట్లలో ట్రాన్స్‌పాండర్స్ వినియోగించాలని మత్స్య శాఖ సంయుక్త సంచాలకుడు పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్‌లో గల మెకనైజ్డ్ బోట్లకు వంద శాతం రాయితీపై ట్రాన్స్‌పాండర్స్ సరఫరా చేసిందన్నారు. సుమారు 634 మంది బోట్లకు ట్రాన్స్‌పాండర్స్‌ను అమర్చడం జరిగిందని వెల్లడించారు. ట్రాన్స్‌పాండర్ అనేది వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరమని, నాభి మిత్ర కమ్యూనికేషన్ సిస్టమ్ అనేది శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ తద్వారా ఫిషింగ్ బోట్లను మోనిటరింగ్ కంట్రోల్ సర్వేలెన్స్ చేయవచ్చున్నారు. ట్రాన్స్‌పాండర్ ద్వారా సముద్రంలో బోటు ఏ స్థానంలో ఉందో తెలుసుకోవచ్చని, నాభిమిత్ర యాప్ ద్వారా సముద్రంపై ఫిషింగ్‌లో గల బోట్ల సంఖ్య స్థానం తెలుసుకునే వీలుంటుందన్నారు. రాబోయే 5 నెలల్లో తుపాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమ బోట్లలో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అలాగే మన దేశ సముద్ర జలాలను దాటినప్పుడు అలారం వలే పని చేస్తుందని వెల్లడించారు. బోట్లలో అమర్చిన ట్రాన్స్‌పాండర్లను ఎల్లవేళలా ఆన్ చేసి ఉంచాలని కోరారు.

రోగులకు అందుబాటులో ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు

- కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిధులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉంచి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిదులతో శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రిని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరుస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధి విధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆ ఆస్పత్రిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఏఎంజీ ఫౌండేషన్ వారు నిర్వహిందుకు ఆసక్తితో ముందుకు రావడం సంతోషదాయకమని, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచేలా తక్కువ ఫీజులు వసూలు చేయాలని, వారికి శ్రీహరిపురం ఎప్ఆర్‌యూ ఆసుపత్రి నిర్వహణపై కొన్ని ప్రతిపాదనలను సూచించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఈ సూచనలపై ఏఎంజీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే విషయాన్ని తెలియపరుస్తామని కమిషనర్‌కు తెలిపారు. ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి సంబంధించిన అంశంపై గతంలో కౌన్సిల్లో చర్చించామని. దానికి అనుగుణంగా ప్రజలకు ఎఫ్ఆర్‌యూ సెంటర్ లీజు అగ్రిమెంటు, ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవల ఫీజుల వసూలు, మెరుగైన వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించడం జరిగిందని కమిషనర్ తెలిపారు.

---

8 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 8న శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి సెక్షన్ పరిధిలో, 10న పాలకొండలో, 17న విశాఖపట్నం జోన్-3 డివిజన్ పద్మనాభం సెక్షన్‌లో , 24న రాజమండ్రి రూరల్ డివిజన్ కడియం సెక్షన్‌లో, 27న జంగారెడ్డిగూడెం డివిజన్ జీలుగుమిల్లి సెక్షన్ కార్యాలయంలో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో తనతో పాటు కమిటీ సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఐజీ శ్రీనివాసరావు



ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు శనివారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో పలు విభాగాలను పరిశీలించారు. జైలు పరిసరాలు అంతా సందర్శించారు. జైలులో ఖైదీలను కలసి మాట్లాడారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదరణ విజిట్ భాగంగా జైలు సందర్శించినట్టు తెలిపారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

విమ్స్‌ను విస్తరించి వైద్య సేవలు మెరుగుపరుస్తాం

- ఎంపీ శ్రీభరత్



విమ్స్‌లో ఆర్వో ప్లాంట్లు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి, డైరెక్టర్ రాంబాబు తదితరులు

ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆసుపత్రి ఆవరణ విశాలంగా ఉన్నందున విస్తరణకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీ శ్రీభరత్ అన్నారు. విమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తలసేమియా వార్డు, సదరం కేంద్రం, లిఫ్ట్, దీవీస్ లేబొరేటరీ సమకూర్చిన మూడు ఆర్వో ప్లాంట్లను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విమ్స్‌లో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చడానికి సుముఖంగా ఉందన్నారు. దివ్యాంగుల సౌలభ్యం కోసం విమ్స్ ఆసుపత్రిలో వారానికి రెండు రోజులు సదరం క్యాంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. డైరెక్టర్ రాంబాబు, ఎమ్మెల్యే రామకృష్ణబాబులు విమ్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అన్నారు. దివీస్ యాజమాన్యం రూ.48 లక్షలతో మూడు ఆర్వో ప్లాంట్లను సమకూర్చిందని తెలిపారు.

కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, మేనేజర్ సురేష్ కుమార్, కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కెల్ల సునీత, టీడీపీ నాయకుడు ఒమ్మి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై సర్వత్రా సంతృప్తి

- ప్రజాస్పందన చూస్తోంటే ఆనందం కలుగుతోంది
- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



వెంకోజీపాలెం : 15వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఆరిలోవ : 12వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కూటమి పాలన పట్ల ప్రజల్లో చక్కని స్పందన కనిపించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 15వ వార్డులోని వెంకోజీపాలెం ప్రాంతంలో శనివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, టీడీపీ సీనియర్ నాయకులు బోర ధనరెడ్డి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే చాలా వరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, మిగిలినవి కూడా అతి త్వరలో పూర్తిగా అమలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెల్లుబోయిన గోవింద్, కర్రి గౌరీ, వరలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, అధ్యక్షులు కర్రి వెంకట అప్పారావు, ఉపాధ్యక్షులు పెంటకోట ప్రకాష్ ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి సీతారామాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేకు శ్రీసీతారామ సేవా సంఘం, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం తరుపున హెచ్‌బీకాలనీ నుంచి వెంకోజీపాలెం హైవే వరకు వీఎంఆర్‌డీఏ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణను నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ముత్యాలరాజు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల 23, 27 బూత్ నెంబరుకు చెందిన దుర్గానగర్, నెహ్రూనగర్‌లో శనివారం కూటమి పార్టీ నేతలు సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఆ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, గత ఏడాదిగా చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అర్హులై ఉన్నప్పటికీ ఏవైనా పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. వారికి ఆయా పథకాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాడి సత్యం, ఒమ్మి పోలారావు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అలాగే 11వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కృష్ణంరాజు, సీనియర్ నేతలు ఆదినారాయణ, ఎర్రాజీ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పారిశుధ్యం పనులు తనిఖీ చేసిన జీవీఎంసీ కమిషనర్

- నిబద్ధతతో విధులు నిర్వహించి నగరాన్ని శుభ్రంగా ఉంచాలని సూచన



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 5(ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన రామటాకీస్, సౌత్ జైల్ రోడ్డు, సిరిపురం, పాండురంగాపురం, హార్బర్ పార్కు రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, 15వ రాత్రి పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పోర్టు రోడ్డు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల ఏయే ప్రదేశాల్లో ఎంతమంది కార్మికులు విధులను నిర్వహిస్తున్నారో వారి విధి విధానాలను పరిశీలించారు. సౌత్ జైల్ రోడ్డు మార్గంలో 15వ ప్యాకేజీ రాత్రి పారిశుధ్య పనులను తనిఖీ చేసి, పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ నిత్యం రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు లేకుండా పరిశుభ్రపరిచి నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. నగరంలో ప్రతి రోడ్డులో వ్యర్థాలు లేకుండా శుభ్రపరిచి వెనువెంటనే వాటిని డంపింగ్ యార్డుకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నేతాజీ



ఎంవీపీ కాలనీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ నూతన అధ్యక్షుడిగా చింతా నేతాజీ ఎన్నికైనట్టు క్లబ్ 3020 పూర్వ గవర్నర్ సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. గత ఏడాది ఇదే క్లబ్‌కు కార్యదర్శిగా చింతా నేతాజీ బాధ్యతలను నిర్వర్తించినట్టు పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనుందని తెలిపారు. నూతన కమిటీ సెక్రటరీగా పి.భాస్కర నరేంద్ర జగన్, కోశాధికారిగా టి.సురేష్, ఉపాధ్యక్షులుగా టి.కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వి.ప్రవీణ్, డైరెక్టర్లుగా ఎస్.వెంకటేష్, బి.శంకరరావు, ఎస్.సునీల్‌కుమార్, డాక్టర్ అశోక్ దేవరకొండ, కె.ఫిరోజ్‌ఖాన్, కె.ఎం. కె.రమేష్, ఎండీ యాసిన్, బచ్చు బ్రహ్మానందం, పి.నాగరాజు, ఎస్.కృష్ణకుమారి, ఎ.ప్రభుజనార్దన్, ఎం.డి. యామిన్, బి.మురళీకృష్ణ ఎన్నికైనట్టు తెలిపారు.

హోటల్ గ్రీన్ పార్కులో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



సిల్క్ ఎక్స్‌పోలో యువతి సందడి

రామ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకల సీజన్ నేపథ్యంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలుకళకళ ప్రతిబింబించేలా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను హోటల్ గ్రీన్ పార్కులో ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీర బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి ప్రదర్శనలో ఒకే చోట అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. మహారాష్ట్ర పైథానీ, బెంగళూర్ సిల్క్, మధ్యప్రదేశ్ చందేరీ, తమిళనాడు కాంజీవరం, జమ్ముకశ్మీర్ తాబి సిల్క్ చీరలు, రాజస్థాన్ బాందినీతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పట్టువస్త్రాలు ప్రదర్శనలో లభిస్తాయని తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉచితమని తెలిపారు. నగర వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మిస్ గ్రాండ్ సీ వరల్డ్ విజేత దిశా

- దుబాయ్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో సత్తాచాటిన విశాఖ యువతి



విజతగా నిలిచిన దిశా పల్నాటి

సిరిపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో జరిగిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ 2025 పోటీల్లో విశాఖపట్నం యువతి దిశా పల్నాటి విజేతగా నిలిచారు. 19 దేశాల నుంచి 60 మంది పోటీదారులు పాల్గొన్న ఈ 11వ ఎడిషన్‌లో దిశా భారత్‌కు ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచింది. దిశా పల్నాటి పాఠశాల విద్యను నగరంలోని వివిధ పాఠశాలల్లో పూర్తి చేసి ప్రస్తుతం జైపూర్‌లోని మణిపాల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. అందం, సాంస్కృతిక సంబంధాల ఔన్నత్యం ప్రధాన ఇతివృత్తంగా నిర్వహించే ఈ పోటీల్లో ఆమె 12 నుంచి 18 ఏళ్ల యువతులకు మధ్య జరిగే టీన్స్ కాంటెస్ట్‌లో మిస్ గ్రాండ్ సీ వరల్డ్ 2025 టైటిల్‌తో పాటు ఉత్తమ జాతీయ కాస్ట్యూమ్ అవార్డునూ సొంతం చేసుకోవడం విశేషం. ఈ పోటీల్లో దిశా మన భారతదేశ జాతీయ పక్షి నెమలిని పోలిన తలపాగాతో పాటు తాజ్‌మహల్, ఇతర జాతీయ ప్రాధాన్యం కలిగిన చిత్రాలతో కూడిన పతాకాన్ని ప్రదర్శించి జూరీ ప్రశంసలు సైతం అందుకుంది.



86వ వార్డు మాతృశ్రీనగర్ శివాలయంలో శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి

శాకంబరిగా అన్నపూర్ణాదేవి

కూర్మన్నపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్ శివాలయంలో కొలువుదీరిన శ్రీకాశీ అన్నపూర్ణాదేవిని శనివారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అలంకృతురాలైన అన్నపూర్ణా దేవిని సందర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

మల్కాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం ఏకేసీ కాలనీ జంక్షన్‌లో గల పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ (ఏఆర్‌వీ) టీకాలు వేయనున్నట్టు డాక్టర్ సునీల్ తెలిపారు. అందువల్ల పారిశ్రామిక ప్రాంతంలో గల పెంపుడు కుక్కల యజమానులు అందరూ ఆస్పత్రికి తమ శునకాలను తీసుకువచ్చి టీకాలు వేయించాలని సూచించారు.

ఏఐ, ఆటోమేషన్‌లతో ఉద్యోగ అవకాశాలు: ఎంపీ శ్రీభరత్



సీఐఐ-ఐటాప్ సదస్సులో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఇతర ప్రతినిధులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఆటోమేషన్ తెలిసిన వారికే ఉద్యోగ అవకాశాలు త్వరగా వస్తాయని అందుకు తగ్గట్టుగా విద్యా సంస్థలు సిలబస్‌ను మార్చుకొని పరిశ్రమకు అవసరమైన వారిని తయారు చేయాలని సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) - ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) కలిసి 'ఏఐ విప్లవం-విద్యా సంస్థల బాధ్యత' అనే అంశంపై నోవాటెల్‌లో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ఇన్నోవేషన్‌తో పాటు విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ఈ సమావేశానికి సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు జి.మురళీకృష్ణ అధ్యక్షత వహించగా, ఎస్‌టీపీఐ అడిషనల్ డైరక్టర్ సురేశ్ బేతా, ఐటాప్ అధ్యక్షురాలు లక్ష్మి, ఐటాప్ ఫౌండర్ రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. సుమారుగా 200 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రజల ప్రభుత్వమిది: ఎంపీ భరత్

కంచరపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వమని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. జీవీఎంసీ 48, 49 వార్డుల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా ఖాళీ చేసినా ముఖ్యమంత్రి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేస్తున్నారన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గండి బాబ్జీనజీర్, లొడగల కృష్ణ, పి.శ్రీనివాస్, సత్యాడ అప్పారావు, ఈతలపాక సుజాత, జయశ్రీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల రద్దుకు డిమాండ్



ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీల తగ్గింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరణ, అదానీ, సెకీ సంస్థలతో జరిగిన విద్యుత్ ఒప్పందాల రద్దు డిమాండ్లతో సీతమ్మధారలో గల ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదాని, సెకీ సంస్థలతో ఒప్పందాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీల్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది గడిచినా విద్యుత్ చార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను చెల్లించుకోలేక గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే, మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు మరచి కార్పొరేట్ సంస్థలకు ప్రజల కష్టార్జితాన్ని దోచిపెట్టే విధానాలను కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. చార్జీలు తగ్గించే వరకు వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలతో కలిసి ప్రజలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సీఎన్ క్షేత్రపాల్, సత్యాంజనేయ, వనజాక్షి, ఆర్.శ్రీనివాస్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌యూలో అందుబాటు ధరలతో వైద్య సేవలందించాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మల్కాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రి (ఎఫ్‌ఆర్‌యూ)లో కోరమాండల్ ఎరువుల కర్మాగారానికి చెందిన ఏఎంజీ ఫౌండేషన్ వారు వైద్య సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం కమిషనర్ తన చాంబర్‌లో కోరమాండల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఎఫ్‌ఆర్‌యూకు వచ్చే ప్రజలకు వైద్యం అందించేటప్పుడు ఫీజులు అందుబాటులో ఉండేలా నిర్ణయించాలన్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం మంది పేదలే కావడం వల్ల అధిక ధరలకు వైద్యం పొందలేరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అందుకు స్పందించిన కోరమాండల్ అధికారులు ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

పర్యాటకం, ఐటీ, విద్యా రంగం..

... 5వ పేజీ తరువాయి

కలిగాయని, అయితే నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సహకారంతో సజావుగా సాగి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. నగరానికి కొత్తగా వచ్చిన డబుల్ డెక్కర్ బస్సులు వారం, పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

వచ్చే ఏడాదిలో ప్రధానంగా మూడు రంగాలపై దృష్టిసారించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఉపాధి అవకాశాలు విస్తృతం చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలంటే పర్యాటకం, ఐటీ, విద్యా రంగాల్లో కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పర్యాటకానికి సంబంధించి అతిథ్య రంగం విస్తరణకు రానున్న రెండు, మూడేళ్లలో నగరంలో పేరున్న పది హోటళ్ల నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే వరుణ్‌బీచ్, అన్నవరంలో ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా మే ఫ్రంట్ హోటల్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. దీనివల్ల యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు నగరానికి రావడంతో వ్యాపారాలు పెరుగుతాయని తద్వారా ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. విశాఖను ఐటీ నగరంగా అభివృద్ధి చేయడానికి కృషిచేస్తామన్నారు. కొత్త సంస్థలను ఆహ్వానించి భూములు కేటాయిస్తామన్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణ చేపట్టామన్నారు. టీసీఎస్ ఈ ఏడాదిలోనే విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నదని, తొలిదశలో రెండు వేల మందిని నియమించుకుంటుందన్నారు. రానున్న రెండు, మూడేళ్లలో పది వేల మందితో కార్యకలాపాలు విస్తరించనున్నదని తెలిపారు. మరికొన్ని ఐటీ సంస్థలు విశాఖ కేంద్రంగా సేవలు అందించడానికి ముందుకువస్తున్నాయన్నారు. పర్యాటకం, ఐటీ రంగాలు, ఇతర రంగాలు ఏర్పాటుకావాలంటే అక్కడ పనిచేయడానికి అవసరమైన నిపుణులు అవసరమని పేర్కొన్నారు. దీనికోసం విద్యా రంగంపై ఫోకస్ పెట్టామన్నారు. భోగాపురం సమీపాన సివిల్ ఏవియేషన్ వర్సిటీ రానున్నదని సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. టెక్నాలజీ రంగంలో పేరున్న విద్యా సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని, వీరి కోసం భూమి సిద్ధం చేశామన్నారు.

విశాఖ అభివృద్ధి కోసం ఎంతో కీలకమైన మాస్టర్‌ప్లాన్ రోడ్లు వీఎంఆర్‌డీఏ ద్వారా నిర్మిస్తున్నామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు 45 నుంచి 50 నిమిషాలలో చేరుకునేందుకు పలు రోడ్లను 2026 జూన్‌కల్లా పూర్తిచేసే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు ప్రకటించారు. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపడతామన్నారు. మౌలిక వసతులు పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తద్వారా ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది నగరంలో కాలుష్యం తగ్గింపునకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నగరంలో 29 శాతం పచ్చదనం ఉండగా, వచ్చే మూడేళ్లలో 33 శాతానికి పెంచుతామన్నారు. ప్రస్తుత ఏడాది ఐదారు లక్షలు, వచ్చే ఏడాది నుంచి ఏటా పది లక్షలు మొక్కలు నాటుతామన్నారు. నగరం నుంచి భీమిలి వరకూ తీరంలో కోత నివారణకు వీఎంఆర్‌డీఏ ద్వారా ప్రాజెక్టులు త్వరలో చేపట్టనున్నట్టు వెల్లడించారు. కేంద్రం నగరంలో దివ్యాంగులకు స్టేడియం మంజూరుచేసిందన్నారు. నగరంలో అన్ని క్రీడా మైదానాలు, స్టేడియాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులు, యువత మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందించేకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి మత్తు నుంచి యువతను దూరం చేయడానికి క్రీడలు ప్రధాన సాధనమని కలెక్టర్ తెలిపారు.

కేజీహెచ్‌కు అవినీతి జబ్బు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులకు సదరు అధికారి స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక్కొక్కరూ రూ.20 వేలు చొప్పున రెండు విడతల్లో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారికి సమర్పించారు. రోజులు గడుస్తున్నా డబ్బులు తీసుకున్న అధికారి ఉద్యోగాన్ని కల్పించకపోవడంతో వారంతా కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. డబ్బులు తీసుకున్నారని, ఉద్యోగం కూడా ఇవ్వలేదని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే, ఎన్‌టీఆర్ వైద్యసేవలో పనిచేసే సుమారు 50 మంది ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కోస్)లోకి మార్పిస్తామంటూ ఆస్పత్రి అధికారి ఒకరు డబ్బులు తీసుకున్నారంటూ వసూలు చేశారంటూ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. రెండు వేర్వేరు వ్యవహారాల్లో ఆస్పత్రికి చెందిన ఉద్యోగులపై ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని వివరణ కోరగా..తన దృష్టికి సమస్య రాలేదన్నారు. ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడిన వసూలుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోపణలపై దృష్టిసారించరా..?

కేజీహెచ్‌లో పనిచేసే ఉద్యోగుల నుంచి అధికారులు డబ్బులు తీసుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణ చేయాల్సిన అవసరం ఉంది. వెంటనే విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కొద్దిరోజుల కిందట ఆస్పత్రి అధికారులకు ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు దీనిపై దృష్టిసారించకపోవడం గమనార్హం.

పేదరికాన్ని రూపుమాపేందుకు పీ-4

... 5వ పేజీ తరువాయి

గుర్తించామని, వారిని మార్గదర్శకులకు అనుసంధానం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో పది మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు. మార్గదర్శి పీ-4 ఫౌండేషన్ అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. పరస్పర సహకారం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. తద్వారా పేదరికాన్ని జయించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం తొలుత సాయం అందించాలని, ఆ తరువాతే మిగిలిన వర్గాల నుంచి సాయం తీసుకోవాలన్నారు. పీ-4 కోసం మరోసారి సర్వే చేస్తామన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

... 5వ పేజీ తరువాయి

వివరాలపై గందరగోళం నెలకొంది. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నా హాజరు వేయడం లేదు. దీనిపై మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలో ప్రైవేటు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చినా ఎక్కువమంది పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు హాజరు వేయకపోవడంతో తల్లికి వందనం పథకం వర్తించదని ఉపాధ్యాయులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తుంగ్లాం భూములను పరిశీలించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం కాలనీలో గల ప్రభుత్వ భూములను శనివారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పీపీపీ విధానంలో చేపట్టనున్న వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్ల నిర్మాణాలకు అనువైన ప్రాంతాల పరిశీలనలో భాగంగా కలెక్టర్ తుంగ్లాం పరిధి సర్వే నంబర్-51లోని భూములను పరిశీలించారు. ఈ భూమి సరిహద్దులతో పాటు ఇతర వివరాలను ఆయన గాజువాక ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అధికారులు మృదుల, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర



మురళీనగర్‌లో ఉత్సవ రథంపై స్వామి వారు



తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తజన సందోహం

మురళీనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మురళీనగర్‌లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జగన్నాథుని తిరుగు రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరుని ఆలయం నుంచి ఆరంభమైన యాత్రలో విశాఖపట్నం హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించన భక్తదాస పాల్గొన్నారు. అలంకృత రథంలో ఆసీనులైన జగన్నాథస్వామిని భక్తులు వేలాదిగా దర్శించుకున్నారు. రథం లాగుతూ ముందుకు కదిలారు. రాత్రి 9 గంటలకు మాధవధార 48ఏ బస్ రూట్ నుంచి ఉడాకాలనీలోని వీఎంఆర్డీఏ కల్యాణమండపానికి రథం చేరుకోవడంతో ఉత్సవాన్ని ముగించారు. కీర్తనలు, సంప్రదాయ నృత్యాల నడుమ రథయాత్ర శోభాయమానంగా సాగింది.

పంచాయతీల అభివృద్ధి సూచీపై సదస్సు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంచాయతీల అభివృద్ధిలో 22 సూచికలు, 9 థీమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. పంచాయతీ అభివృద్ధి సూచికపై జిల్లా పరిషత్ సమావేశమందిరంలో శనివారం నిర్వహించిన అవగాహన సదుస్సులో ఆయన మాట్లాడారు. అలాగే డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి సూచిక గురించి పూర్తిగా తెలుసుకుని పంచాయతీరాజ్ శాఖ ప్రదానం చేసే జాతీయ అవార్డులు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

10న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలు

మహారాణిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 10న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శనివారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,385 పాఠశాలల్లో 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులతో హాజరుకావాలని సూచించారు.

డీసీసీబీలో అంతర్జాతీయ సహకార దినోత్సవం



డీసీసీబీ ఆవరణలో సహకార జెండాను ఎగురవేస్తున్న కోన తాతారావు

ఎన్.ఎ.డి.జంక్షన్ జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం మర్రిపాలెం వుడా కాలనీలో గల డీసీసీబీ కార్యాలయ ఆవరణలో బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో సహకర సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం కోన తాతారావు మాట్లాడుతూ మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడానికి సహకార సంఘాలు, సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ పరపతి నుంచి ఆరోగ్య సంరక్షణ, శక్తి రంగం, విద్యా రంగాల్లోకి డీసీసీబీని త్వరలో విస్తరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుజల స్రవంతి పూర్తికి యత్నిస్తా: మాధవ్

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెద్దలందరి సహకారంతో పోలవరం పూర్తవుతుందని, ఈ ప్రాంతానికి చెందిన సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను శనివారం అక్కయ్యపాలెం పోర్టు కళావాణి కల్యాణ మండపంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు హాజరై మాధవ్‌ను అభినందించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, తనపై ప్రేమతో ఇంత మంది వచ్చి అభినందనలు తెలిపారని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎప్పుడూ కృషిచేస్తానని, అందరితో సమన్వయంతో ముందుకు వెళతానని చెప్పారు.

పలు ప్రత్యేక రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

తేదీల్లో విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ వెళ్లి, తిరుగు ప్రయాణంలో (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 6న విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18516) ఈ నెల 6, 7 తేదీల్లో కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుందని తెలిపారు.

బటర్‌ఫ్లై పార్కు స్థలం బదలాయింపుపై ఆరా

... 5వ పేజీ తరువాయి

ఆ ప్రతిపాదన ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీంతో నగరానికి చెందిన కూటమిలోని కీలక నేత ద్వారా మంత్రాంగం నడిపించారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ ఈ ఏడాది మే నెలలో గుట్టుగా మెమో జారీచేసింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 4న 'జీవీఎంసీ పార్కు పాయె' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులను సీడీఎంఏ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆరా తీసి, దానికి సంబంధించిన ఫైల్‌ను పంపించాలని ఆదేశించినట్టు తెలిసింది.

పెంపుడు జంతువులతో పారాహుషార్!



కుక్క కరిస్తే రేబిస్ వ్యాప్తి

- కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కీలకం..
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు
- నేడు జునోసిస్ డే

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుక్క, పిల్లి వంటి జంతువులను చాలా మంది పెంచుకుంటూ కుటుంబ సభ్యుల మాదిరి సాకుతుంటారు. అయితే అజాగ్రత్తగా ఉంటే వీటి ద్వారా రేబిస్ వంటి వ్యాధులు సంక్రమించి, ప్రాణాకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెంపుడు జంతువుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 6న జునోసిస్ డే నిర్వహిస్తున్నారు. రేబిస్‌కు లూయీ పాశ్చర్ 1985 జూలై 6న టీకాను ప్రపంచానికి అందించడంతో అదే రోజున జునోసిస్ డేగా పాటిస్తున్నారు.

జునోటిక్ వ్యాధులు అంటే..?

జంతువుల నుంచి మనుషులకు, వారి నుంచి జంతువులకు సంక్రమించే వాటిని జునోటిక్ వ్యాధులు అంటారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా జంతువుల నుంచి వ్యాప్తి చెందుతుంటాయి. రేబిస్, లెప్టోస్పైరోసిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే దానికి రేబిస్ సోకుతుంది. రేబిస్ వైరస్ ఉన్న కుక్క, పిల్లి, ఆవు వంటి పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు రేబిస్ సోకుతుంది.

రేబిస్‌తో ప్రాణాలకు ప్రమాదం

రేబిస్ వైరస్ వీధి కుక్కల్లో ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కుక్క సెలైవాలో రేబిస్ వైరస్ ఉంటుంది. కరిచిన వెంటనే సెలైవా మనిషి శరీరంలోకి వెళ్లి రేబిస్ బారినపడేలా చేస్తుంది. కుక్క కాటుకు గురైన 12 గంటల్లోగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు (జీరో డోస్), మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు డోసు తీసుకోవాలి. రేబిస్ బారినపడిన వారికి చికిత్స ఉండదు. వీధి కుక్క పెంపుడు కుక్కను కరిస్తే వెంటనే దానికి కూడా రేబిస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా కాపాడవచ్చు. శరీరంలోకి వెళ్లే వైరస్ మోతాదును బట్టి ప్రమాద తీవ్రత ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

రేబిస్ వైరస్ బారినపడిన మనుషులు సొంగ కార్చడం, నీటిని, వెలుతురును చూసి భయపడడం, కుక్క మాదిరిగా అరవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైరస్ బారిన పడిన జంతువులు మనుషులను గుర్తించలేవు. కాళ్లు, చేతులు పడిపోయినట్టు ఉండడం, నడవలేకపోవడం, నీటిని తీసుకోలేకపోవడం, సొంగ కారడం, అరుస్తూ ఉండడం వంటి లక్షణాలు ఉంటాయి.

వ్యాక్సిన్ కీలకం..

ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయాలి. కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవడం కూడా అత్యంత కీలకం. నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ప్రాణాలకు ప్రమాదం.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించడం అవసరం



కొన్ని రకాల జంతువులను పెంచుకునే అలవాటు కొందరిలో పెరిగింది. అయితే, కుక్క, పిల్లి వంటి జంతువులను పెంచుకునే వారు వీధి కుక్కలతో వీటిని కలకుండా చూసుకోవాలి. వీటి ద్వారా రేబిస్ వైరస్ బారినపడే ప్రమాదం ఉంది. ఒకసారి రేబిస్ బారినపడితే చాలా ప్రమాదం. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్క కాటుకు గురైన వ్యక్తి 12 గంటల్లోగా వ్యాక్సిన్ తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. జునోసిస్ డేను పురస్కరించుకుని కోర్టు సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. -డాక్టర్ కె.బసవారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్



డైరెక్టర్ రాజును సత్కరిస్తున్న పంచకర్ల

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన శాప్ డైరెక్టర్

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన పీవీఎస్ఎన్ రాజు శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సుజాతనగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేను కలిసి రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపట్టనున్న శాప్ ప్రణాళికలను వివరించారు. క్రీడలతో గ్రామీణ, పట్టణ యువత భవితకు బాటలను వేయాలని పంచకర్ల సూచించారు. అనంతరం శాప్ డైరెక్టర్ రాజుకు దుశ్శాలువా కప్పి ఎమ్మెల్యే సత్కరించారు. అలాగే మరో డైరెక్టర్ మేడిద రమేశ్‌కుమార్ (రాజా) పంచకర్లను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సత్యసాయి భక్తుల వితరణ

పెందుర్తి-రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి సుజాత నగర్, గిరిప్రసాద నగర్ పాపయ్యరాజు పాలెం, గొల్లవిల్లివానిపాలెం, పురుషోత్త పురం మండల పరిషత్ పాఠశాలల్లో శనివారం సత్యసాయి భక్తులు వితరణ కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్లు, రబ్బర్లు, బిస్కెట్లు, తదితరమైనవి పంపిణీ చేశారు. సత్యసాయి సంఘ భక్తులు బి.జ్యోతి, ఎం.గోపి, పి.తాతారావు, టి.సీతా రామయ్య, పి.రమణమ్మ, సీహెచ్ భవానీ, దివ్య, నాగమణి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 34, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్యరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కరపత్రాలను ప్రదర్శిస్తున్న పల్లా శ్రీనివాసరావు, నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి-స్వర్ణాంధ్ర సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పల్లా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను నెలకు రూ.4 వేలు, తల్లికి వందనం, 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, రహదారులకు మరమ్మతులు చేపట్టడం, తదితర అభివృద్ధి పనులను చంద్రబాబు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి-సంక్షేమం సమానంగా ముందుకు సాగుతుందన్నారు. వైసీపీ హయాంలో ఛిద్రమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తూ, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం దూసుకుపోతుందని పల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు రాసాలమ్మ కాలనీకి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆయనను కోరగా, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి నల్లూరు సూర్యనారాయణ, తదితరులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు నజీర్, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, పప్పు రాజారావు, వేగుంట శ్రీనివాస్, గణపతి,రమేశ్,జగదీశ్,సుబ్బయ్య, నాగార్జున, బుజ్జమ్మ, పావని, తదితరులు పాల్గొన్నారు.

అలాగే 87వ వార్డులో కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని, సీఎం చంద్రబాబు న్యాయకత్వం ప్రజలకు శ్రీరామ రక్ష అని అన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బి.రాజన్‌రాజు, ఎస్.పెంటారావు, బి.నాగేశ్వరరావు, దానయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ముందుకు సాగుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రయంలో భాగంగా 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం ప్రధాన రహదారి నుంచి గవరవీధి రామాలయం వరకు ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు మళ్ల అప్పారావు, సీతారమ్, ప్రసాద్, ఎన్.పైడిరాజు, శరగడం అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వార్డు పరిధిలోని టీడీపీ నాయకులు దుర్గవానిపాలెం ఎస్సీకాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తుందన్నారు. నాయకులు ములకలపల్లి పెంటయ్య, పి.సోమునాయుడు, మొల్లి పెంటిరాజు, నమ్మి రాము, టి.అప్పారావు, ఈశ్వరరావు, రమణబాబు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గణబాబు



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక ఎదుగుదలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో సమారు 50 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ప్రత్యేక చొరవతో మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కుట్టు మిషన్‌ను ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. 61,62,63 వార్డులకు చెందిన మహిళలకు ఇక్కడ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, నాయకులు నీలాపు జోజి, చంద్రశేఖర్, నరిసింగరావు, శ్రీధర్, గంగాధర్, శ్రీను, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరం ప్రారంభం

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో శనివారం టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారందరూ విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం గణబాబు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు

ఇండక్షన్ స్టౌవ్‌ల పంపిణీ

గోపాలపట్నం: విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఐసీడీఎస్ సింహాచలం సెక్టార్ పరిధిలోని 32 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, విద్యార్థులకు పుస్తకాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. తమ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో గణబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు వసతులు కల్పించడంతో పాటు విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే పాఠశాలల్లో చేర్పించేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కె.నీలిమ, ఏసీడీపీవో జి.సరిత, సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

హోటల్ గ్రీన్ పార్కులో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ఎక్స్‌పోలో ఆకట్టుకునే శారీతో యువతి

రామ్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకల సీజన్ నేపథ్యంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను హోటల్ గ్రీన్ పార్కులో శనివారం ప్రారంభించారు. ఈ నెల 9 వరకు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రాలను అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు, తదితరమైనవి ప్రదర్శనలో ఒకే చోట అందుబాటులో లభ్యమవుతున్నాయన్నారు. మహారాష్ట్ర పైథానీ, బెంగళూర్ సిల్క్, మధ్యప్రదేశ్ చందేరీ, తమిళనాడు కాంజీవరం, జమ్ము కశ్మీర్ తాబి సిల్క్ చీరలు, రాజస్థాన్ బాందినీతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పట్టు వస్త్రాలు ఇక్కడ లభ్యమవుతాయని వివరించారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రవేశం ఉచితమని, నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అగనంపూడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి 33/11 కేవీ సబ్ స్టేషన్, వీఎస్ఈజడ్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పాత అగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలి హిల్స్, దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్, మంగళలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలి

- కార్పొరేటర్ బి.గంగారావు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ విశాఖ విమల విద్యాలయాన్ని తక్షణమే తెరవాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ విద్యాలయాన్ని తెరవాలని డిమాండ్ చేస్తూ శనివారం స్కూల్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను తెరిచి 25 రోజులు అవుతున్నా విశాఖ విమల విద్యాలయాన్ని ఇప్పటికీ తెరవకపోవడం దారుణమన్నారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు అసలేం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారని, అందువల్ల ఉక్కు యాజమాన్యం తక్షణమే చొరవ తీసుకోవాలని కోరారు. కార్పొరేట్లకు వీవీవీ పాఠశాలను అప్పగించేందుకు కుట్ర జరుగుతుందని గంగారావు ఆరోపించారు. ఈ విద్యాలయాన్ని తెరిచేంత వరకు తాము పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృతిమ మేథస్సుతో భవిష్యత్తులో అద్భుతాలు

మల్కాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కృతిమ మేథస్సుతో భవిష్యత్తులో అద్భుతాలను సృష్టించవచ్చని సౌదీ అరేబియాలోని బజాన్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ మసీహ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం 'మానవ, కృత్రిమ మేథస్సుల విప్లవాత్మక సహకారం' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ మేథస్సుతో కలిసి కృత్రిమ మేథస్సు రాబోయే కాలంలో వివిధ వృత్తుల్లో పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. తక్కువ సమయంలో కచ్చితమైన నిర్ణయాలను తీసుకునేందుకు, మానవ తప్పిదాలను కృత్రిమ మేథస్సు తగ్గిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వైద్య రంగంలో రోగ నిర్ధారణలో, ఆరోగ్య నివేదికల విశ్లేషణలో, క్యాన్సర్ వంటి జబ్బులకు సంబంధించి ముందస్తు హెచ్చరికల్లో ఇది కీలక పాత్ర వహించనున్నదన్నారు. వైద్యంతో పాటు విద్యా రంగంలో, వ్యవసాయ, వ్యాపార, మార్కెటింగ్ , రక్షణ రంగాల్లో కూడా ఇది అద్భుతాలను సృష్టిస్తుందన్నారు. అయితే కృతిమ మేథస్సును ఎంతో బాధ్యతతో నైతికంగా, పారదర్శకంగా వినియోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణుడు డాక్టర్ గ్లోరియా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్యాస్లిన్, సదస్సు నిర్వాహకురాలు వై.ప్రేమలత, అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లను ఘనంగా సత్కరించారు.

క్రైం... crime news

వైద్యుని ఇంట్లో చోరీ: పనిమనిషి అరెస్టు

17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన మహిళను క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 17 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌లో రవీంద్రభారతి స్కూల్ సమీపంలోని ఓ ఫ్లాటులో నివసిస్తున్న మండపాటి రాఘవేంద్ర విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో గల గురుదేవ్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య నగరంలోని ఎన్‌టీఈపీలో కన్సల్టెంట్. మూడేళ్ల క్రితం తమ ఇంట్లో పనులు చేసేందుకు గాను వేపగుంటలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన తనుబుద్ధి సత్యవతి (45)ని పనిమనిషిగా పెట్టుకున్నారు. పనిమనిషి నమ్మకంగా ఉండడంతో కొంతకాలం కిందట ఆమెను తమ ఇంట్లోనే ఉండమన్నారు. ఈ క్రమంలో గతనెల 25న విధులకు వెళ్లి వచ్చిన రాఘవేంద్ర దుస్తులు తీద్దామని చూడగా బీరువా తెరిచి ఉండడంతో పాటు లాకర్‌లో భద్రపరిచిన 17 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పనిమనిషే చోరీకి పాల్పడి ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సూరిబాబు... సత్యవతిని తమదైన శైలిలో విచారించడంతో నేరం చేసినట్టు అంగీకరించింది. తన కుమార్తె వద్ద చోరీ సొత్తును భద్రపరిచానని చెప్పడంతో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్తురాలి నుంచి 3 తులాల బంగారం స్వాధీనం

బస్టాపు వద్ద వేచివున్న ఓ మహిళ బ్యాగు నుంచి బంగారం కాజేసిన పాత నేరస్తురాలిని పోలీసులు అరెస్టు చేసి 3 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గొలజాగపు మోహిని అనే మహిళ ఈ ఏడాది ఏప్రిల్ 4న విజయనగరం వెళ్లేందుకు పెందుర్తి బస్టాప్ వద్ద వేచి ఉంది. బస్సు రావడంతో ఎక్కి టికెట్ తీసుకునేందుకు బ్యాగు తీసి చూడగా అందులో భద్రపరిచిన 3 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా వారు కోటపాడుకు చెందిన పాత నేరస్తురాలైన మేకల సంధ్య (27)ను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించడంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి: ముగ్గురి అరెస్టు

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జనావాసాలు గల కాలనీలో భార్యాభర్తలుగా చెప్పుకుని అద్దెకు దిగిన ఇంట్లో గుట్టుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శనివారం పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీశెట్టి ధనలక్ష్మి అనే మహిళతో సహజీవనం చేస్తున్న వివేక్ తాము భార్యాభర్తలమని చెప్పి సుజాతనగర్ రత్నగిరినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను ధనలక్ష్మి ఇక్కడకు తీసుకువచ్చి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తుంది. స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో కొద్ది రోజులుగా నిఘా పెట్టి శనివారం గుట్టురట్టు చేశారు. నిర్వాహకురాలు ధనలక్ష్మి, వివేక్‌తో పాటు ఒక విటుడు, ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, బాధిత యువతులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక స్వధార్ హోమ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

జైయాంధ్ర కాలనీలో కార్డన్ సెర్చ్

41 మద్యం బాటిళ్లు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సింధియా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైయాంధ్ర కాలనీలో శనివారం ఉదయం 5 గంటలకు మల్కాపురం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఓ దుకాణంలో తనిఖీలు చేస్తుండగా అక్రమంగా విక్రయించేందుకు నిల్వ ఉంచిన 41 మద్యం బాటిళ్లను స్వాధీనం ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే సరైన పత్రాలు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీను తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

8 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఏలూరు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 8న శ్రీకాకుళం సర్కిల్ టెక్కలి సెక్షన్ పరిధిలో, 10న పాలకొండలో, 17న విశాఖపట్నం జోన్-3 డివిజన్ పద్మనాభం సెక్షన్‌లో , 24న రాజమండ్రి రూరల్ డివిజన్ కడియం సెక్షన్‌లో, 27న జంగారెడ్డిగూడెం డివిజన్ జీలుగుమిల్లి సెక్షన్ కార్యాలయంలో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు అండగా పీ-4 విధానం అమలు

పెందుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం దాతల, ప్రజల భాగస్వామ్యంతో (పీ-4) కార్యచరణ ప్రణాళికకు అధికారులు సన్నద్ధత కావాలన్నారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన పీ-4 విధానంపై నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామీణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో దారిద్ర్యరేఖకు దిగువన గల కుటుంబాలను గుర్తించి పీ-4 పోర్టల్ ద్వారా వారిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకోసం అధికారులు సమన్వయం చేసుకుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మందికి, అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందికి చేయూత అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ నేపథ్యంలో పేదలకు అండగా నిలవాలనుకునే దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలను సంప్రదించి పీ-4లో భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, జెడ్పీ హేమవతి, పెందుర్తి, సబ్బవరం, పరవాడ ఎంపీడీవోలు గుండాల అప్పలరాజు, రమేశ్‌నాయుడు, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లు

గాజువాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాత గాజువాకలో భారీ గణనాథున్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈసారి కూడా ఇక్కడ అతి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ చైర్మన్ కొసిరెడ్డి గణేశ్ తెలిపారు.